
Assembles Of The Living Elohim(1.Tim 3:15), India Presents.................

Satyamunakai Poratam **REGD. NO. 67970/97**

# సత్యమునకై పోరాటం

జీవముగల ఎలోహీం సమాజము




Editor & Publisher : **Bro. Isaac E. Kusuma,**
**MALIKIPURAM** - 533 253
E.G.Dt. (A.P.) India
Website : www.aotle-india.org
E-mail : info@aotle-india.org
Office Ph : 98493 85038

Regd. Monthly Newspaper
**Postal Regd. No. H/APM/01**
Valid upto 12/2009 Posted on 30th of Every Month
**Annual Subscription Rs.50/-**

To :

VOLUME: 13 | TAMMUZ -AV 5769 (July- 2008) | Pages : 4 | Issue : 127

**హెచ్చరిక : ఈ పత్రిక ఖండితముగా సత్యాన్వేషుల కొరకు మాత్రమే గాని, క్రైస్తవ మతశాఖల వారి కొరకు కాదు.**

# త్రిత్వముయొక్క చరిత్ర

త్రిత్వము లేక తండ్రి కుమార పరిశుద్ధాత్మలనెడి ముగ్గురు ప్రత్యేక వ్యక్తుల సిద్ధాంతము సంఘములోనికి ఎలా చొరబడినదో చరిత్ర పుటల్లోనుండి కొన్ని విషయములు మీకు విపులముగా తెలియజేయుదుము. 1700 సం॥ల నుండి ఎలోహీం దృష్టికి శత్రువులైన మూర్ఖముగా సత్యమును అడ్డగించు సాతాను శాఖల సంఘములను చరిత్రాత్మకమైన ఋజువులతో వెంటాడి ఏకత్వమును నమ్మి, వెంబడించి, బోధించుచున్న మీకుబలమును ధైర్యమును కలుగునట్లు ఈ వ్యాసమును వ్రాస్తున్నాను.

లోకమునందున్న మతశాఖలన్నియూ తక్కువ కాకుండ కనీసం ముగ్గరు దేవుళ్ళనే విశ్వాసాన్ని కలిగిఉండగా, లోకమునందలి జనులు తక్కువ అనుకుంటే ముగ్గురు ఎలోహీంల యందును, ఎక్కు అనుకుంటే యింక అనేక ఎలోహీం యందు విశ్వాసాన్ని కలిగి ఉన్నారు. బహుళ ఎలోహీంల (ముగ్గురుగాని అంతకు మించిగాని) ఆరాధనమే సాతాను యిష్టపడితాడు అభివృద్ధి చేయగలడు అన్యజనాంగము వారి ఆచారములు పండుగల ద్వారా ఆరాధించే బహుళ ఎలోహీంల పద్ధతిని క్రైస్తవులలో సాతానుడు ఎందుకు ప్రవేశపెట్టినట్టు? జీవముగల ఎలోహీం సంఘమును శిధిలం చేయాలనే ఉద్దేశముతోనే క్రైస్తవ్యములో ముగ్గురు దేవుళ్ళ ఆరాధన – క్రిస్ట్‌మస్, మంచి శుక్రవారం, ఈష్టరు అను పండుగల రూపంలో ప్రవేశపెట్టి సాతానుడు దాని పధకాన్ని నెరవేర్చుకున్నాడు.

తండ్రిగాను, కుమారుడుగాను, పరిశుద్ధాత్మద్వారానూ దేవుడు తానే తన పనులను నిర్వర్తించుటను బట్టి (Three offices) తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ అను పదములు బైబిలు గ్రంథమునందు కనబడుచుండగా, మేము బైబిలునందు త్రిత్వమును కనుకొన్నాము (DISCOVERED) అని క్రైస్తవులు గంతులు వేస్తున్నారు. అయితే దైవలేఖనమునకు మానవుని ఆలోచన సంకరము చేయుట ద్వారా ఏర్పడినదే త్రిత్వము, కాబట్టి త్రిత్వమనేది సంకరజాతి సిద్ధాంతమైయున్నది.

త్రిత్వము సంకరము కాకుండ లేఖన ప్రకారమైనదై యుంటే ప్రవక్తలు ప్రవచించి ఉండేవారు యావె ఆ మాట ఉపయోగించి ఉండేవాడు, శిష్యులను బోధించమని ఆజ్ఞాపించి యుండేవాడు, ప్రతికల్లో వ్రాయబడియుండేది ఇందులో ఏ ఒక్కటీ జరుగలేదు. ఎవరూ త్రిత్వాన్ని కనీసం ప్రస్తావించలేదు.

ప్రకటించినవాడను, రక్షించినవాడను, దాని గ్రహింపజేసినవాడను నేనే అని యెషయా 43:12 నందును అనాదికాలములో వాక్కుఅయినవాడే, శరీరధారియైవచ్చిన ఎలోహీమని యోహాను 1:1,2,14 వాక్యము లందుండగనూ, మధ్యవర్తియు ఎలోహీం ఒక్కడేనని గలతి 3:20 నందును. ఎలోహీమే శరీరమునందు ప్రత్యక్షమాయెనని 1తిమోతి 3:16 నందును వాక్యములు బోధిస్తూ ఎలోహీం ఒక్కడేనని ఋజువు చేయున్నవి. "ఈ వాక్యప్రకారము బోధించనియెడల వారికి అరుణోదయము కలుగదు" అని యెషయా 8:20 నందు ప్రవచన పూర్వక హెచ్చరిక వాక్యము వినబడుచున్నది.

త్రిత్వము అనగా నేమిటి? అని అనేకులు ప్రశ్నించుచున్నారు. త్రిత్వమును గూర్చి గాని త్రిత్వము అనుమాటను గూర్చిగాని, బైబిలు గ్రంథమునందు లేని కారణమునుబట్టి త్రిత్వమనగానేమో క్రైస్తవ శాఖలవారికి తెలియుటలేదు. ఎలోహీం ఒక్కడైయున్నాడని క్రైస్తవులు బోధింతురు. అయితే ఒక్కడైయున్న ఎలోహీం తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ అను ముగ్గురు ప్రత్యేక వ్యక్తులుగా విభజింపబడియున్నారనియు చెప్పుదురు. ఒక్క ఎలోహీం – ముగ్గురు ప్రత్యేక వ్యక్తులుగా విభజింపబడి యున్నారని బోధించుటయే త్రిత్వము ((త్రి–తత్వము అని అందురు. అయితే ఒకే ఎలోహీంని మూడుముక్కలుగా విభజించి ఎందుకుచెప్పుచున్నారో బోధించేవారికి తెలియదు ఒక్క ఏలోహీమేమిటి? ముగ్గురు వ్యక్తులేమిటి? అనెడి అనుమానము ఆ త్రిత్వబోధవినే క్రైస్తవ శాఖలవారికి కూడ రావటంలేదు.

సృష్టిలో ముగ్గురు ఎలోహీంల సిద్ధాంతాన్ని లేక తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ అను సిద్ధాంతానికి ప్రారంభము ఎచ్చట ఎలా ఎవరిద్వారా జరిగిందో మీకు విపులపరతును. బాబేలు గోపురమును కట్టుటకు పధకమును వేసిన కూషు కుమారుడైన నిమ్రోదు ఈ సాతాను త్రిత్వానికి కారకుడైయున్నాడు. నిమ్రోదును గూర్చి వాక్యములో ఇలా ఉంది. యావె యెదుట పరాక్రమముగల వేటగాడైన నిమ్రోదు అని కలదు నోవాహు కాలమునాటి జలప్రళయానంతరపు లోకానికి నిమ్రోదు రాజును, యాజకుడైయున్నాడు.(ఆది 10:8–11 నిమ్రోదు ఆధ్వర్యములో బాబేలు గోపురము కట్టుటలో ఎలోహీం స్థానంలో లేక యావెకు బదులు నిమ్రోదు నిలిచియున్నాడు. NIMROD the "mighty hunter Before Yahweh" means Nimrod stood in the place of Yahweh or instead of Yahweh.

నిమ్రోదు కుయుక్తిపరుడు గనుక తనపరిపాలనలోని ప్రజలు తన యందు మరి ఎక్కువగా భక్తిభయములు నిలుపునట్లు ఒక పథకమును యోచించినాడు. శీతాకాలములో సూర్యుడు ఆలస్యముగా ఉదయిస్తాడు (The winter Solstice) సూర్యుడు ఆలస్యముగా ఉదయించటాన్ని ఆసరాగా తీసికొని ప్రజలను పెడదారి పట్టించియున్నాడు. మీ ప్రవర్తన సూర్య దేవునికి గిట్టుటలేదు. ఆ కారణమును బట్టి ఈ దినములలో సూర్యుడు ఆలస్యముగా ఉదయిస్తున్నాడు అని తనచేత పాలించబడే ప్రజలతో నిమ్రోదు పలికియున్నాడు. మా పాపము పోవునట్లు మా తరపున మీరు సూర్యదేవునికి ప్రార్థించవలయునని ప్రజలంతా నిమ్రోదును వేడుకున్నారు. సూర్యుడు త్వరగా ఉదయించు కాలంలో నిమ్రోదు ప్రజలతో ఇలా అన్నాడు మీ తరపున సూర్య దేవుణ్ణి వేడుకున్నాను నా ప్రార్థన విని ఆయన మిమ్మును క్షమించాడు అని చెప్పాడు. అప్పటినుండి నిమ్రోదు ఆనాటి ప్రజలకు ఎలోహీం తరపున ఉత్తరవాదిగా భావించబడ్డాడు. తరువాత మరణించిన నిమ్రోదు సూర్యునిలో ఐక్యమైపోయాడని ప్రజలు మూఢంగా నమ్మివారు నిమ్రోదును ఆరాధించుటే సూర్యారాధనగా మారింది.

నిమ్రోదు తల్లిపేరు సెమిరామిస్ నిమ్రోదు మరాణానంతరము అతని తల్లి కొన్ని విషయములు చెప్పి ప్రజలను నమ్మించింది. చనిపోయిన నిమ్రోదు అను నా కుమారుడు సూర్య దేవునిగా పరలోకరాజ్యమును పరిపాలిస్తున్నాడని సెమిరామిస్ చెప్పింది చనిపోయిన తన కుమారుడైన నిమ్రోదు ఆత్మస్వరూపిగా వచ్చి తనకు భార్యగా నన్ను చేసుకొని నా గర్భములోనుండి తానే కుమారుడుగా భూలోకమునకు వచ్చాడు అని సెమిరామిస్ చెప్పింది. తల్లిని భార్యగా చేసికొని కుమారుడుగా పుట్టిన నిమ్రోదు పేరు తమ్మూజు (Tammuz) ఈ తమ్మూజు అనువాడు డిసెంబరు 25 తేదీన పుట్టాడు, తమ్మూజు పుట్టినరాత్రి (డిసెంబరు 24 రాత్రి) చచ్చిపోయిన ఒకచెట్టు మొద్దులోనుండి రాత్రికిరాత్రే ఒక పచ్చని కొమ్మ పుట్టుకొచ్చిందని చెప్పింది. ఆ చెట్టు క్రింద ఉంచబడిన తమ్మూజు అను కుమారుడు (నిమ్రోదు) నకు అనేక బహుమానము లివ్వబడెను. చచ్చిన చెట్టుమొద్దు నిమ్రోదు అనియు, మొద్దునుండి పుట్టిన లేత కొమ్మ కుమారుడైన తమ్మూజు లేక నిమ్రోదు యొక్క అవతారమని చెప్పింది. తమ్మూజు పుట్టినరోజు జ్ఞాకార్థముగా డిసెంబరు 25 తేదీన జరిగే పండుగనే యూలి పండుగ అందురు. (Yuli Feast) ఈ పండుగనే మొదటి టి–మాస్ (T-Mass TAMMUZ MASS) లేక తమ్మూజు మాస్ (పండుగగా) అనేవారు కాలక్రమేణా యీ పండుగ రంగుమార్చుకొని క్రీస్తు పుట్టుకగా (X-MASS) క్రైస్తవ సంఘములలో వ్యవహారములోకి వచ్చింది తమ్మూజు 40 ఏండ్లవాడై చనిపోయెను. 1 సంవత్సరానికి ఒక రోజు చొప్పున 40 ఏండ్లకు 40 దినాలు సంతాపదినాలుగా తమ్మూజు నిమిత్తము బబులోను స్త్రీల ద్వారా ఆచరణలోనికి వచ్చినవి. అన్యజనులద్వారా ఆచరించబడెను ఈ ఆచారాన్ని ఇశ్రాయేలీయులు ఆచరించి సూర్యారాధనలో నిమ్రోదును, తమ్మూజు కొరకు సంతాపదినాలనూ ఆచరించుట యెహెజ్కేలునకు ఏలోహీమైన యావె చూపించియున్నాడు. యెహెజ్కేలు 8:5–17; ఇప్పుడు క్రైస్తవులు ఆచరించే (Lent Season) లెంట్ తమ్మూజు నిమ్మితమే సుమా.

నేను చనిపోయిన తరువాత ఆత్మస్వరూపిగా మండలములలో నివసించుచు భూమికి సారమునిచ్చు దేవతగాను మనుష్యులకు శరీరేచ్చతో కూడిన ప్రేమను రేకెత్తించు దేవతగా ఉందునని తన మరణానికి ముందే నిమ్రోదు తల్లి భార్యయైన సెమిరామిస్ ప్రకటించుకున్నది. ఆకాశరాణియను పేరుతో ఎలోహీం జనాంగమైన ఇశ్రాయేలీయులు నిమ్రోదు తల్లి మరియు భార్యయైన సెమిరామిస్‌ను ఆరాధించినట్టు యిర్మియా 7:17,18,30 వచనాల్లో మనము కనుగొనగలము. ఇప్పుడు గమనించండి ముగ్గురు ఎలోహీంల సిద్ధాంతము లేక త్రిత్వము అనేది ఎలా పుట్టుకొచ్చిందో.

నిమ్రోదు – తండ్రి – (సూర్య దేవుడు)

తమ్మూజు – కుమారుడు (నిమ్రోదు అవతారం

సెమిరామిస్ ఆత్మస్వరూపి (నిమ్రోదు తల్లి + భార్య).

ఇదే త్రిత్వము సర్వలోకము అనాదిగా ఆరాధించుచు వచ్చిన అపవిత్రమైన ఆచారము. తండ్రి, కుమార, పరిశుద్ధాత్మయను సిద్ధాంతము, బబులోనీయులద్వారా ఈ విధముగా సృష్టించబడినది.

భారతదేశంలో బహుళ దేవతలను ఆరాధన చేయుటలో ప్రజలు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు అను ముగ్గురు ప్రత్యేకవ్యక్తులు సృష్టిని దాని గమనాన్నీ నిర్వహిస్తున్నట్టు నమ్ముచున్నారు ముగ్గురు ప్రత్యేక దేవతల – త్రిత్వమును – విగ్రహారాధికులైన వీరు నమ్ముదురు. కావున త్రిత్వము అను ముగ్గురు వ్యక్తుల ఆరాధన అన్యజనులైన విగ్రహారాధికుల ఆచారమని మరొకసారి ఋజువగుతుంది.

క్రీ॥శ॥ 175 సం॥రంలో సిరియా దేశమునందలి ఎపామియ అను ఊరివాడైన నుమినియస్ అను పేరుగల విగ్రహారాధికుడైన తత్వవేత్త ఎలోహీం గూర్చి యిలా నిర్వచించాడు మొదటిది మనస్సు అని చెప్పాడు. మనస్సు మార్పులేనిది, సూక్ష్మమైనదియు మంచిది, వివేకమైనదట.

మనస్సు దేవుని సృష్టించలేదు కాబట్టి, మనస్సునుండి రెండవ వ్యక్తి పుట్టకొచ్చాడట. ఈ రెండవ దేవుడు దేనినైనా సృష్టించగలడట.

రెండవ వ్యక్తి యొక్క కొంత శక్తియే – సృష్టించబడిన వాటి యందు ఆత్మగా నివసిస్తూ మూడవ వ్యక్తియైనాడట ఈవిధముగా ఎలోహీం త్రిత్వము లేక ముగ్గురువ్యక్తులై యున్నారనెడి సిద్ధాంతాన్ని రెండవ శతాబ్ధములో నుమినయస్ అను వేదాంతి సృష్టించాడు. నుమినియస్ సిద్ధాంతము ప్రకారము త్రిత్వమనగా ఏమిటి?

మనస్సు (మొదటివాడు లేక తండ్రి)

కుమారుడు (సృష్టికర్త లేక రెండవవాడు)

ఆత్మ (సృష్టికార్యములనియందున్న ఆత్మ – మూడవది)

మనస్సు లేక తండ్రి + కుమారుడు + ఆత్మ ఇది సిరియా దేశపు విగ్రహారాధికుడు సృష్టించిన త్రిత్వము. కావున త్రిత్వము అనుముగ్గురు ప్రత్యేక ఎలోహీంలు అనబడు వ్యక్తుల ఆరాధన అన్యజనుల ఆచారమని మూడవదిగా ఋజువు చేయబడుతుంది. నుమినియస్ అను ఈ సిరియా వేదాంతిచేత కల్పించబడిన, త్రిత్వమనే కల్పనను, వెంబడించి, అతని తరువాత ఆ సిద్ధాంతము యొక్క వ్యాప్తి నిమిత్తమై పాటుపడిన వారు అనేకులు గలరు.

అలెగ్జాండ్రియాకు చెందిన యూదుడైన తత్వవేత్త క్రీ॥శ॥ 50 సం॥రంలో ఒక సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాడు. ఇతనిపేరు ఫిలోజూడియస్ (Philo Jildaeus) ఇతడు యూదుడు కాబట్టి ధర్మశాస్త్రమునందు ప్రావీణ్యము, ప్రేమగలవాడై యుండును. అయితే ఇతను గ్రీకుల ప్రాంత ముందుండుటనుబట్టి గ్రీకుతత్వమును కూడ జీర్ణించుకొని యూదా మతమును, గ్రీకు తత్వమునకు సరిపడేలా ముడిపెట్టాలని ప్రయాసపడి యున్నాడు. ఇతడు యూదుడు గనుక యావెయే నిజమైన ఏకైక ఏలోహీమని నమ్మకముగలవాడు లోగోస్ అనగా (LOGOS) వాక్యము అని అర్ధము కాబట్టి యోహాను 1:1 వాకవ్యమునకు విశేషమైన, విపరీతములు కల్పించి ఒక త్రిత్వాన్ని తయారుచేసాడు. ఎలోహీం యొక్క పరిపూర్ణతనుండి సృష్టించబడి ఉనికి కలిగియున్న సమస్తజీవులు అనిత్యమైనవై, దైవసంబధమైన లోగోస్ లేక వాక్యమైయున్న యషువ మెస్సీయ మూలుముగా కలుగుచున్నవి అని చెప్పుచూ వాక్యమైయున్న మెస్సీయ్యకు రెండవస్థానమును కల్పించి, యావెకు మొదటి స్థానమును కల్పించి, సకల జీవులయందున్న జీవము ఎలోహీం ఆత్మ మూడవ వ్యక్తియని చెప్పి త్రిత్వమును తయారుచేసాడు. ఈవిధముగా త్రిత్వమునే తప్పుడు సిద్ధాంతానికి పునాదులువేసి, అపోస్తులుడైన పౌలు గ్రీకురాజ్యాలకు సువార్తను ప్రకటింపకముందే ఫిలో జూడియస్ అను యూదా తత్త్వవేత్త త్రిత్వమనే దుర్భోధను వ్యాప్తిలోనికి తెచ్చాడు. త్రిత్వమనేది మానవుని కల్పనయని యిది నాల్గవ ఋజువుగా యిచ్చుచున్నాను.

క్రీ॥పూ॥ 384–322 మధ్యలో అరిస్టాటిల్ అను గ్రీకు తత్వవేత్త ఎలోహీం గూర్చి నిర్వచనము ఇలా చెప్పాడు. ఎలోహీం అనేది తనకు తానుగా ఉన్నదై, ఏకాంతమై ప్రపంచమునకు బయట నిలుస్తుంది. ఆయన తన మనస్సుద్వారా లేక మరొక శరీరక వ్యక్తిత్వము ద్వారా ప్రపంచానికి దూరంగా నిలుచున్న ఎలోహీంతో సంబంధము కలిగి ఉంటాడు. అని చెప్పి అదృష్యుడైన దేవుడొకడు, బాహ్యానికి మనము ఊహించుకొంటున్న ఎలోహీం రెండవవాడు అనెడి భేదమును చూపిస్తూ ఎలోహీమనగా యిద్దరు ప్రత్యేక వ్యక్తులని విభజనను బోధించాడు. దేవత్వములో ఇద్దరు లేక ముగ్గురు వ్యక్తుల సిద్ధాంతము విగ్రహారధికులైన మానవుల తలంపునుండి కలిగినదని చ్పొటకు ఋజువుగా యిచ్చుచున్నాను.

కీ॥పూ॥ 428–328 మధ్యకాలములో, గ్రీకు సామ్రాజ్యము నందలి ఏదెన్సుకుచెందిన ప్లేటో అను తత్వవేత్త ఎలోహీం గూర్చి ఇలా నిర్వహించాడు. ఇతడు విగ్రహారాధికుడు, కాబట్టి ఎలోహీం లేక దేవతలు అనబడినవి భోగములకు, వ్యాధిబాధలకు, దురాత్మలకు అతీతంగా ఉంటారు. కాని భోగములకు, వ్యాధిబాధలకు, దుర్మాత, ప్రభావమునకులోను కాగలిగిన వ్యక్తి మరొకరు ఉండి ఆ వ్యక్తి అదృష్య దేవుని స్వరూపమైన రెండవ వ్యక్తియై యుంటాడని బోధించి ఇద్దరు వ్యక్తుల సిద్ధాంతాన్ని కల్పించాడు. విగ్రహారాధికులైన యిలాంటి తత్త్వవేదాంతులచే కల్పించబడిన ఇద్దరు వ్యక్తుల సిద్ధాంతాన్ని మనస్సులో స్థిరపరచుకొని బైబిలు గ్రంథాన్ని చూసినప్పుడు తండ్రియు, కుమారుడని, పరిశుద్ధాత్మ యనెడి మాటలు కనుగొని ముగ్గురు వ్యక్తుల సిద్ధాంతాన్ని యీ గ్రీకు తత్వవేత్తలే సృష్టించారు. ముగ్గురు వ్యక్తుల సిద్ధాంతము మానవ కల్పితమని ఋజువుచేయడానికి ఆరవ ఋజువుగా దీనిని యిచ్చుచున్నాను.

క్రీ॥శ॥ 354-430 మధ్యకాలంలో అల్జీరియా దేశమునందలి ధగస్టే అను ప్రాంతమునకు చెందిన అగస్టీన్ అనువాడు త్రిత్వమును గూర్చిన బోధకునిగా ఉండెను. యితడు దేవత్వమునుగూర్చి ప్లేటో సిద్ధాంతాన్ని చదివి, ప్రభావితుడై, ఆ బోధను హృదయంలో స్థిరపరచుకున్నాడు. త్రిత్వమును గూర్చిన యితని వంకర వ్యాఖ్యానాలు మధ్యయుగపు ప్రజల హృదయాలలో అధికముగా ప్రభావితమైనవి. వాక్యమనగా దేవత్వములో రెండవ వ్యక్తి అనెడి భావనలోనే అగస్టీన్ స్థిరపడ్డాడు. మొదట యితడు విగ్రహారాధికుడు, అన్యుడు తరువాత ఎలోహీమనగా, ఒక్కడే అనే భావనలో ఉన్నవాడే. కాని అగస్టీన్ తల్లి కేథలిక్ సంఘసభ్యురాలు కాబట్టి యితడు తన తల్లినిబట్టి కేథలిక్‌గా మారిపోయాడు. తదుపరి క్రీ॥శ॥ 386లో అల్జీరియా నందలి హిప్పోదేవాలయానికి కేథలిక్ బిషప్‌గా చేయబడ్డాడు. మానవునికి శరీరము, ప్రాణము, ఆత్మ అనునవి కలిగి ఒకటిగా ఎలా కనబడుచున్నాడో అలాగే దేవుడు ఒక్కడైయుండి, తండ్రి, కుమార, పరిశుద్ధాత్మయై యున్నాడని దేవత్వమునందలి త్రిత్వమనబడు ముగ్గురు వ్యక్తుల సిద్ధాంతాన్ని బోధించాడు. విగ్రహారాధికులచే కల్పించబడిన వ్యాఖ్యానాలను చదివి, స్థిరపరచుకొని, లేఖనములను ఎరుకగ త్రిత్వమును బోధించాడే తప్ప యితడు లేఖనములు ఎరిగినవాడు కాడు. ముగ్గురు వ్యక్తుల దేవత్వము విగ్రహారాధికులచే, ప్రవేశ పెట్టబడిన దుర్బోధయనుటకు ఏడవ ఋజువుగా దీనిని యిచ్చుచున్నాను.

క్రీ॥శ॥ 312 సం॥రం॥ల సీజరు, (కానిస్టెంటయిన్ చక్రవర్తి) కేథలిక్‌గా మార్పుచెందాడు. ఈ కేథలిక్ బిషప్ యొక్క గౌరవము, అధికారము, తెల్లవారే సరికి ఆకాశ జ్యోతులను దాటిపోయింది. మెస్సీయ పూర్వమునుండి దేవుడనగా యిద్దరు ప్రత్యేక వ్యక్తులని నిర్వచనములు పలికిన విగ్రహారాధికులు, అన్యులునైన అరిస్టాటిల్, ప్లేటో మున్నగు తత్వవేదాంతుల బోధలచే మరలు కొల్పబడిన గ్రీకు తత్వవేదాంతులు సీజరు యొక్క పలుకుబడి సంపాదించారు. అటుతరువాత దేవుడనగా యిద్దరు లేక ముగ్గురు వ్యక్తుల కలయికయై యున్నదని చక్రవర్తి మెదడుకు ఎక్కించారు. మేము నూతన నిబంధన పరిశీలించగా తండ్రి ఒకరు కుమారుడొకరు, పరిశుద్ధాత్మ వేరొకరు అని మత్తయి 28:19 లోనూ, సువార్తలలో అక్కడక్కడ కనుగొన్నా మనియు, చెప్పి చక్రవర్తికి నూరిపోసారు. దానితో చక్రవర్తి పూర్తిగా, ముగ్గురు వ్యక్తుల కలయికయే దేవత్వము అనెడి పిచ్చినమ్మకములోనికి వచ్చాడు. అతడు లేఖనములను ఎరిగినవాడు, మారుమనస్సు ఉన్నవాడునూకాడు గనుక దర్బోధకు తర్వగా ప్రభావితుడై మూఢనమ్మకస్తుడైపోయాడు.

క్రీ॥శ॥ 314 సం॥రంలో ఆఫ్రికా ఖండములో త్రిత్వము లేక తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ యనెడి వ్యక్తుల పేర్ల మీద బాప్తిస్మమిచ్చు పద్ధతిని ప్రవేశపెట్టుటకు సీజరు ఒక సమావేశమును ఏర్పాటు చేసియున్నాడు తండ్రి కుమార పరిశుద్ధాత్మ బిరుదులలో గనుక ఒకడు బాప్తిస్మమును పొందియున్నచో, అట్టివాడు మరల తిరిగి వేరొక బాప్తిస్మమును పొందనవసరము లేదు. అట్టివాడు పరిశుద్ధాత్మ పొందినాడని నిర్ధారించాడు. ఈవిధముగా తండ్రి కుమార పరిశుద్ధాత్మ బిరుదులలో బాప్తిస్మము పొందుచున్నవారికి, యాజకుడు వారినెత్తిమీద చేతులుంచి, నీవు పరిశుద్ధాత్మను పొందావు అని నమ్మించేవారు కాని స్టెంటయిన్, చక్రవర్తియైన సీజరు తానుచేసిన ప్రతిపాదనలు బలపరచుకొనడానికి “ఎవడైతే ఈ ముగ్గురు వ్యక్తుల సిద్ధాంతాన్ని తిరస్కరించునో వాడు, వాని ఆస్థిని, ప్రభుత్వానికి కోల్పోతాడు, సమాజములో ఏ హక్కులూ వాడికి ఉండవు” అని ప్రకటనలు జారీ చేసియున్నాడు.

యింత కఠినమైన ఆజ్ఞలు ఎందుకు జారీచేసాడనగా – మూడవ శతాబ్ధములో దక్షిణ ఆఫ్రికాకు చెందిన సబెలియన్, రోమాపట్టణమునకు చెందిన ఆర్టిమాన్, అరేబియాలో బెరిల్లను అనువారు ఏకత్వమును గూర్చియు, యషువమెస్సీయ నామమునందలి బాప్తిస్మమును గూర్చియు, బహు శక్తితో బోధించుచు మూడవ శతాబ్దపు త్రిత్వ బోధకుల ప్రయత్నాలను త్రిప్పి కొట్టుచూ వారిని హద్దుమీరకుండ గట్టి ప్రయత్నములు చేసియున్నారు. కాబట్టి వారు చేయగలిగిందేమి లేక నాల్గవ శతాబ్దపు ప్రారంభములో ప్రభుత్వము యొక్క సహకారాన్ని, చేయూతను ఆర్థించి – అంతియొకయు సంఘమునకు కాపరియు, త్రిత్వ సిద్ధాంతులకు సింహస్వప్నముగా తయారైన, యషువమెస్సీయ నామము నందలి బాప్తిస్మమును ఎలోహీం యొక్క ఏకత్వమును బోధించిన సమోస్థవాడైన పౌలుకు, ఇతర దేశ ప్రభుత్వముతో రహస్య సంబంధాలున్నాయని సాకుపెట్టి, అంతియొకయ సంఘకాపరి పదవినుండి పౌలుగార్ని దింపించివేసినారు.

క్రీ॥శ॥ 325 సం॥రం॥లో కానిస్టంటయిన్ తన సామ్రాజ్యమంతటియందుగల 300 నుండి 318 బిషప్‌ల సర్వసాధారణ కూటమును ఏర్పాటు చేసియున్నాడు. ఈ కూటమునకు హాజరైన సభ్యులంతా మారుమనస్సు లేనివారునూ, మతములో క్రొత్తగా చేరినవారునై యున్నారు. త్రిత్వమును గూర్చిన ప్రతిపాదన సభలో కానిస్టంటయిన్ చక్రవర్తి ద్వారా ప్రవేశపెట్టబడినప్పుడు పిలువబడినవారంతా వాక్యమునకు భిన్నమయిన హోమ్యూసియస్ (Homousios) అను మాటను సృష్టించిరి. హోమ్యూసియస్ అనగా ఒకటే మూలము (One Substance) అని అర్ధము. ఈ మాటనుబట్టి తండ్రి కుమార పరిశుద్ధాత్మలు ముగ్గురు ప్రత్యేక వ్యక్తులనియు, అయినను వారి మూలము ఒకటే, వారు ముగ్గురు అన్నింటియందును సర్వసమానము అని నిర్ధారణచేసి, తండ్రి కుమార పరిశుద్ధాత్మయను ముగ్గురు వ్యక్తులనియు, అట్టి బాప్తిస్మమును ప్రతీవారు అనుసరించాలని అధికారికంగా అమలుచేసారు.

ఎథినేసియస్ (క్రీ॥శ॥ 293-373) నీసియా సమావేశానికి హాజరైన వారిలో ఒకడు, ఇతడు, సమాలోచన సభలో తీర్మానించిన త్రిత్వము లేక తండ్రి కుమార పరిశుద్ధాత్మయను సిద్ధాంతము పవిత్రమైనది, తిరుగులేనిది, దీనిని ఎవరూ మార్చకూడదు. అనుసరించుటలో పొరపాటు చేయకూడదు. తండ్రి కుమారులతో పరిశుద్ధాత్మకూడ అన్నింటిలోనూ సర్వసమానము అంటూ తన జీవితకాలమంతయూ త్రిత్వము కొరకు పోరాడునట్టి తన ఆశక్తిని కనపరచుకొనుటకు క్రీ॥శ॥ 381 సం॥రం॥లో రెండవ సమావేశమును ఏర్పాటు చేసియున్నాడు. ఎథినేసియస్ శాఖనుగూర్చి 5వ శతాబ్ధములో వ్రాయబడినది.

క్రీ॥శ॥ 431 సం॥రం॥లో ఎఫెను పట్టణమందు మూడవ సమావేశము ఏర్పాటు చేయబడినది, 325 సం॥రం॥లో నీసియా సమావేశము 381 సం॥రం॥లో ఎథినేసియస్ సమావేశములోనూ, ఏ యే విషయములైతే తీర్మానించారో, వాటినే ఈ మూడవ సమావేశములో కూడ తిరిగి ఆమోదించారు. అయితే, ఎఫెసునందలి ఈ సమావేశము యొక్క ప్రాముఖ్యత ఏదనగా – కన్య మరియు పరసంబంధమైనదియు, యషువమెస్సీయనకు తల్లియునైన్నదని, వాక్యమునకు భిన్నంగా ఒక తీర్మానము చేసారు. ఈ విషయములన్నియూ రోమా ప్రభుత్వమునకు సంబంధించిన సంఘ చరిత్రలో (Canon) నికి ఎక్కించిన కారణమునుబట్టి అందలి విషయాలను చర్చించడానికి మిగిలినవారు భయపడ్డారు. ఈ విధముగా సమావేశములు ఏర్పాటుచేసి మానవకల్పిత త్రిత్వానికి పునాదులు వేసారు. ప్రచారములను పెంచారు. దానినిబట్టి త్రిత్వము ఈనాటి వరకూ ఆచరించబడి మూఢముగా నమ్మబడుచూ, నెరవేర్చబడుచున్నది.

క్రీ॥శ॥ 325 సం॥రంలో కానిస్టెంటుయిన్ ద్వారా ఏర్పాటు చేయబడి 318 మంది బిషప్‌ల ద్వారా ఆమోదింపబడిన ముగ్గురు వ్యక్తుల (త్రిత్వపు Trinitarian) సిద్ధాంతము – సత్యమునునమ్మి, బోధించుచుండిన యేకత్వపువీరుల రక్తమును ఒలికించడానికి కారణమైన అనేక రాజకీయమైన, మతపరమైన అంతర పోరాటాలకు దారితీసింది. కాబట్టి జీవముగల దేవుని సత్య సంఘస్తులపట్ల నీసియా సమావేశము సాతాను యొక్క శక్తి అమలుపర్చబడినట్టు చెప్పుకొనవచ్చును.

నీసియా సమావేశముల అనంతరము దేవుని యొక్క ఏకత్వమును, యషువమెస్సీయ నామమునందలి బాప్తిస్మమును బోధించిన సమూహమునకు సంభవించిన సంగతులు క్రైస్తవ సంఘ చరిత్రలో విపులపర్చబడినవి. అపోస్తలుడైన పౌలు బోధించిన వాక్య ప్రకారమైన బోధనునమ్మి, వెంబడించుచున్న అంతియొకయ సంఘకాపరియైన వేరొక పౌలు సహవాసములో ఉండినవారంతా తిరిగి రెండవమారు త్రిత్వమను బిరుదుల్లోకి బాప్తిస్మమును పొందవలయునని ఒత్తిడి చేయబడ్డారు. కేథలిక్ బిషప్‌గా చేయబడుటకు అర్హత గలవారంతా తిరిగి మరల కేథలిక్ పద్ధతి ప్రకారమైన అభిషేకమును పొందవలయునని సంఘ చరిత్రలో ఆదేశించారు. మతపరమైన శాసనాలను అమలు చేయడానికి రాజకీయపరమైన శక్తిని ఉపయోగించుచూ కేథలిక్‌లు వారి అభిప్రాయాలను అమలులోనికి తెచ్చియున్నారు. ఎలోహీం యొక్క ఏకత్వమును యషువ మెస్సీయ నామమునందలి బాప్తిస్మమును బోధించుకొనెడి సేవకులు కేథలిక్ బిషప్పుల అజమాయిషీకి దూరంగా ఉండాలి అని ఒకప్పుడు నిర్ణయించినవారే, ఆ శాసనాన్ని తారుమారుచేసి కేథలిక్ బిషప్పులు సెలవులేకుండా, వారికి తెలియకుండ, ఏకత్వమును బోధించువారు ఏమీ బోధించకూడదు. వారి ఆధీనములో ఉండాలి అని చెప్పి శాసనములను చేసారు.

ఒక ప్రాంతములో ఉన్న ఏకత్వపు సమాజమువారు, తిరిగి తండ్రి కుమార పరిశుద్ధాత్మ బిరుదులలో బాప్తిస్మమును పొందాలనియు అలాగు సర్వ సమాజము బాప్తిస్మము పొందినట్టు ఆ ప్రాంతమందలి కేథలిక్ బిషప్పుకు సమాచారమును అందించి, ఏకత్వబోధకులు కేథలిక్ బిషప్పువద్ద అభిషేకమును పొందవలయుననియు, కఠినమైన ఆజ్ఞలను జారీచేసి యుండిరి. ఈ ఆజ్ఞలను గనుక నిరాకరించినట్లయితే, ప్రతిఫలముగా సంఘం యొక్క ఆస్తులే గాకుండా, సేవకుని ఆస్తి కూడ దోచుకొనబడుననియు, సమాజపరమైన ఏ హక్కు ఉండదని కఠినమైన ఆజ్ఞలు జారీచేసారు. ఈ కేథలిక్ ఆజ్ఞలను జడిసి ఏకత్వమును బోధించేవారు, భూమిలోపలి సొరంగాలకో లేక రహస్య స్థావరాలకోపోయి దాగుకొనియైనా సత్యము బోధించుటకు నిలవబడవలయునని నిర్ణయించుకున్నారు, రాజకీయపరమైన అధికారముకూడ కేథలిక్ వారిచేతుల్లో ఉండిన కారణమునుబట్టి ఆ ప్రకారము దాగుకొనుట మరీప్రమాదపరిస్థితులకు దారితీయునని భయపడ్డారు.

రోమా ప్రభుత్వపు సంఘము 4వ శతాబ్ధములో మెస్సీయ యషువ నామమున యిచ్చిన బాప్తిస్మమును అనధికారపు బాప్తిస్మముగా (A symbol of heresy) చిత్రించి ప్రచారము చేసారు. క్రీ॥శ॥ 326-329 మధ్యకాలములో లవొదికయలో ఒక కేథలిక్ సమావేశము ఏర్పాటైనది, ఈ సమావేశములో – యషువ మెస్సీయ నామమున బాప్తిస్మము పొందినవారు తిరిగి తండ్రి కుమార పరిశుద్ధాత్మయను బిరుదుల్లో బాప్తిస్మమును పొందవలయునని నిర్ణయించిరి. యషువమెస్సీయ నామమునందలి బాప్తిస్మము మా నిర్ణయ పూర్వకముగా చెల్లనేరదు అని చాటించారు. ఈ శాసనము జారీయగుటతోనే అనేకులు ఏకత్వమనెడు వాక్య సత్యములోనుండి తొలగిపోయి, విశ్వాసమును జాడవిడుచుకున్నారు.

డెబ్బది సం॥రం॥ల తరువాత అనగా సుమారు క్రీ॥శ॥ 450 సం॥రం॥లో ప్రస్తుతము టర్కీ దేశమునందున్న అంతియొకయు (అంటా కియాగా యిప్పుడు పిలవబడుతుంది). యందున్న ఏకత్వమును బోధించెడి సంఘములకు శ్రమ హెచ్చించబడినది. పురాతన కాలములో అంతియొకయ గొప్ప జనసాంద్రత గల పట్టణమై, అప్పటి ప్రపంచమునందలి మిక్కిలి హెచ్చయిన వ్యాపారపు కేంద్రములలో అంతియొకయ ఒకటై యున్నది. కేథలిక్ సంఘము జరిపించిన పరిశోధనలో, అంతియొకయలో యషువ మెస్సీయ నామమునందలి బాప్తిస్మము వ్యాప్తిలో విరివిగా ఉన్నట్టు గ్రహించారు. ఆకారణమును బట్టి, అంతియొకయు కేథలిక్ సంఘానికి బిషప్పుగా ఉంటున్న మార్టేరియన్ అనునతడికి ఒక లేఖ వ్రాయుచూ సెబేలియస్ అనునతడి ద్వారా బోధించబడుచున్న యషువమెస్సీయ నామము నందలి బాప్తిస్మము చెల్లదని బోధించమని, ఆజ్ఞాపించమని, కానిస్టెంటు నోపిల్ నుండి సీజరు చక్రవర్తి వద్దనుండి, ఒక లేఖ అందినది. అయితే అధికముగా ఒత్తిడులకు గురియైనా, యషువమెస్సీయ నామమునందలి బాప్తిస్మము రోమా సామ్రాజ్యమంతటిలోనూ, విస్తృతముగా వ్యాపించినది.

క్రీ॥శ॥ 458 సం॥రం॥లో ఉత్తర తూర్పు ఇటలీ ప్రాంతమున వ్యాప్తిలో ఉన్న యషువమెస్సీయ నామమునందలి బాప్తిస్మపు బోధ వలన కేథలిక్ వారు ఎక్కువ యిబ్బందికి గురియైనారు. ఈ విషయములో ఇటలీ యందలి ఎక్వీలియా బిషప్, పోలప్‌లియోకు ఒక ఉత్తరం వ్రాయుచూ ఇతరులు భయపెట్టుట వలననో, బలవంత పెట్టుటవలననో లేక తప్పుగా ఆలోచించుట వలననో, తండ్రి కుమార పరిశుద్ధాత్మ బాప్తిస్మము గాక రెండవమారు యషువమెస్సీయ నామమున బాప్తిస్మమును పొందుచున్నారు అని వ్రాసినాడు. దానికి సమాధానముగా మార్చి 21న 458లో పోప్ లియో సమాధానమును వ్రాయుచూ కేథలిక్ సంఘానికి తిరిగి రావాలని నిర్ణయించుకొనే వారు తాము యషువమెస్సీయ నామమున బాప్తిస్మమును పొందిన పొరపాటుకు, పరిహారంగా కొంత జరిమానా చెల్లించి, సంఘములో చేర్పించమని, ఎక్వీలియా బిషప్‌కు సూచనలు యిచ్చి యున్నాడు.

జస్టీనియస్ అను నతడు తూర్పు రోమా సామ్రాజ్య చక్రవర్తిగా క్రీ॥శ॥ 527 నుండి 565 సం॥ రం॥ వరకూ పరిపాలించాడు. అతని పరిపాలనలో క్రీ॥శ॥ 529 సం॥రంలో యషువ మెస్సీయ నామమున బాప్తిస్మమును అమలుజరిపే వారికి 1. తండ్రి కుమార పరిశుద్ధాత్మ బిరుదులను ఒప్పుకో లేనందుకు 2. రెండవమారు యషువమెస్సీయ నామమలో బాప్తిస్మము లిచ్చుచున్నందుకు మరణదండన విధించుచూ, తన పరిపాలనా కాలమంతటిలో ఏకత్వమును బోధించే వారి పట్ల బహు క్రూరముగా వ్యవహరించాడు.

తూర్పు రోమా సామ్రాజ్యమునందు బహుగా విస్తరించిన ఏకత్వపు సంఘమువలన యషువమెస్సీయ నామమునందలి బాప్తిస్మము ప్రచారము చేయబడి అమలులోనికి వచ్చే ప్రమాదమున్నదని కేథలిక్ సంఘము గుర్తించినది. ఆకారణమునుబట్టి చక్రవర్తి కానిస్టెంటయిన్ (సీజరు) ద్వారా క్రీ॥శ॥ 533 సం॥రంలో రెండవ సర్వసభ్య సమావేశము ఏర్పాటు చేయబడినది. సబేలియస్ ద్వారా వ్యాప్తిచేయబడు బాప్తిస్మము చెల్లదని ఆ సమావేశములో తీర్మానించారు. యషువమెస్సీయ నామమున బాప్తిస్మముల నిచ్చుట రెండవరకపు బాప్తిస్మముగా లెక్కించి, అట్టిబాప్తిస్మమును పొందినవారికి, బోధించినవారికి మరణదండన విధింపబడవలయునని శాసనము చేసిరి. ఈ శాసనాన్ని రోమా సంఘచట్టంలోకి ఎక్కించారు.

తూర్పు రోమా సామ్రాజ్యములోనే గాక, 6వ శతాబ్ధములో మార్టిన్ డూమియమ్ క్రీ॥శ॥ 579 సం॥రంలో బ్రాకా అను పట్టణానికి కేథలిక్ బిషప్‌గా ఉంటున్నాడు. ఈ బ్రాకా అనేది ప్రస్తుత కాలము నందు పోర్చుగల్ దేశమందు కలదు. మార్టిన్ డూమియమ్ కాలము నందు పశ్చిమ రోమా సామ్రాజ్యములో కూడ యషువమెస్సీయ నామము నందలి బాప్తిస్మమును బోధించెడి ఏకత్వపు సంఘాలు (Oneness Group churches) చాలా ఎక్కువ సంఖ్యలోనే ఉన్నవి. పోర్చుగల్‌కు చెందిన కేథలిక్ బిషప్ డూమియమ్ స్పెయిన్ దేశముందున్న కేథలిక్ బిషప్ మోనిఫేస్‌కు క్రీ॥శ॥ 561-579 మధ్యకాలంలో వ్రాసిన ఉత్తరం ద్వారా బయలుపడుతుంది. బాప్తిస్మమునందు ఒకేసారి నీటముంచడము ఒకే నామమున ఉపయోగించినప్పుడే అట్టి బాప్తిస్మము తండ్రి కుమార పరిశుద్ధాత్మయను దేవత్వము యొక్క ఏకత్వమునకు సరిపడుననియు, అయితే వ్యక్తుల యొక్క తేడా చూపించబడదనియు నేను వింటున్నాను. తండ్రియైనా, కుమారుడైనా, ఆత్మయైనా ఒకే ఒక దేవుడనియు, యషువ మెస్సీయ నామమున బాప్తిస్మమిచ్చుచూ, ఒకేసారి నీటముంచి లేపుటయే సరియైన క్రమమని, సబేలియన్ శాఖకు చెందినవారు బాప్తిస్మమును అమలుజరుపుట నేను గమనిస్తున్నాను. నేనైతే మన కేథలిక్ విశ్వాసపరిమాణము చొప్పున తండ్రి కుమార పరిశుద్ధాత్మయను బిరుదులు చెప్పి మూడుమార్లు నీటముంచి లేపుటయును, ఆచారమునకే కట్టుబడి యుంటిని అని మార్టిన్ డూమియం బోనిఫెస్ అను బిషప్‌కు తానువ్రాసిన లేఖలో స్పష్టము చేసాడు. కాబట్టి పశ్చిమ రోమా సామ్రాజ్యములో కూడ 6వ శతాబ్ధములో యషువమెస్సీయ నామమునందు బాప్తిస్మములిచ్చి ఏకత్వమును ఎక్కువగా బోధించుట జరిగినదని ఋజువగుచున్నది.

క్రీ॥శ॥ 325 లో కానిస్టంటయిస్ (సీజరు) ద్వారా ఏర్పాటు చేయబడిన నీసియా సమావేశములో తండ్రి కుమార పరిశుద్ధాత్మయను బిరుదుల బాప్తిస్మము అధికారికంగా అంగీకరించి ప్రవేశపెట్టినంత మాత్రమున యషువమెస్సీయ నామములో బాప్తిస్మములిచ్చుటయను వాక్య ప్రకారమైన క్రియ నిలిపివేయబడలేదు. కాని అది మధ్య యుగములో నుండి 20వ శతాబ్ధము వరకూ, కొనసాగుచునే వచ్చింది. దేవుని యొక్క ఏకత్వమును, యషువమెస్సీయ నామమునందలి బాప్తిస్మమును బోధించెడి సమాజములవారిని, అప్పటి కేథలిక్ ప్రభుత్వము భూసారంగములలోనికినీ, రోమా సామ్రాజ్యపు నలుమూలలకునూ, తోలివేసింది. క్రీ॥శ॥ 476 సం॥రంలో ఉత్తర దిక్కునుండి వచ్చిన కొండజాతి వారి ద్వారా పశ్చిమ రోమా సామ్రాజ్యము ముట్టడి వేయబడినది, దానితో రోమా సామ్రాజ్యానికి చీకటియుగము ప్రారంభమైనది, తూర్పు రోమా సామ్రాజ్యమైతే తరుస్కులు, పారశీకులు, అరబ్బుల దండయాత్రలకు గురియైపోయినది. 8వ శతాబ్ధములో అరబ్బులు – పాలస్తీనాను, ఐగుప్తును ఉత్తర ఆఫ్రికాను స్పెయిన్ దేశాన్ని రోమీయుల చేతినుండి కైవసము చేసికోగలిగారు. తూర్పు బైజాంటైన్ సామ్రాజన్యము క్రీ॥శ॥ 1453 సం॥రంలో పడిపోయింది తూర్పు ఐరోపా భాగాన్ని మట్టుకు ఒక వెయ్యి సంవత్సరాలు, తూర్పు భాగాన నివసించే హొర్డు జాతి లేక తెగవారి చేతినుండి కాపాడగలిగారు. ఆకాలములోనే యూరప్ దేశాలు అభివృద్ధి చేయబడినవి; అలాగుననే యిప్పుడున్న యూరప్ సాధరణ బజారు కూడ అభివృద్ధి చెందగలిగింది.

అటుతరువాత కొండజాతీయుల దండయాత్రలు, ముట్టడింపుల కారణమున చరిత్ర వెలుగులో సమయము కాలములను గుర్తించుట కొంచెము కష్టమే. ఒకప్పుడు కేథలిక్‌ల ద్వారా భూసొరంగములలోనికి బలవంతాన నెట్టివేయబడిన ఏకత్వమును. యషువమెస్సీయ నామమున బాప్తిస్మము బోధించిన సమాజము యొక్క అభివృద్ధిని సమంగా అంచనావేయలేము. ఎందుకంటే వారి కార్యములు బాహాటముగా ప్రజలముందు కానరాలేదు. స్థానికంగా ఉంటున్న ఏకత్వమును బోధించెడి కాపరులు వారి సమాజములను గూర్చిన సమాచారమును తెలియజేయుటకు యిష్టపడలేదు.

కేథలిక్ రోమా ప్రభుత్వము వలన శ్రమలవేడి కొంత తగ్గుముఖం పట్టిన తరువాత ఏకత్వమును బోధించెడివారు – ఉత్తరమున పెన్నోనియా (హంగెరీ), క్రోయాటియా (యుగోస్లానియా), మరియు ప్రస్తుతకాలపు రష్యా, భూభాగములకు చెదరిపోయినారు. మరికొందరు పర్షియా, ఆర్మీనియా మొదలగు ప్రాంతములలో దక్షిణాదికీ, తూర్పునకు వలస వెళ్లిపోయారు. మరికొందరు ఐతియోపియా మొదలగు దేశములో స్థిరపడ్డారు. కొన్ని సందర్భములలో ఏకత్వపు నాయకులు మాత్రమే వలస వెళ్ళిడివారు తప్ప మిగిలిన సమాజమంతా ఉన్నచోటనే ఉండేవారు. అయితే అనేక నాయకులు, సమాజములు, యషువ మెస్సీయ నామమును చాటుటకు బయలువెళ్లిరని, నిస్సందేహముగా చెప్పుకో వచ్చును. ఒక వ్యక్తి పరిశుద్ధాత్మతో నింపబడి సత్యమును చాటుటకు మాత్రమే అలాగు వారు దేవునిచేత నడిపించబడి బయలువెళ్ళిరి. ఎందుకనగా “పాతాళ లోకము యొక్క ద్వారములు ఈ సంఘము ముందు నిలువనేరవని” యషువ మెస్సీయ ముందుగనే మత్తయి 16:18 నందు ప్రవచించియుండిరి.

పశ్చిమ దేశాల్లో ఏడవ శతాబ్దము వరకు దేవుని యొక్క ఏకత్వమును గూర్చిన బోధయు, యషువ మెస్సీయ నామమునందలి బాప్తిస్మమును ఆచరణలో ఉండినట్టు చరిత్ర నుండి మీకు చూపించి యుంటిమి, 3వ శతాబ్ధములోని వారికంటె ఏమాత్రమూ తక్కువ లేకుండ 7వ శతాబ్ధములోని పోప్‌లు యషువ మెస్సీయ నామములో బాప్తిస్మము నిచ్చుటను నిరాకరించారు. తండ్రి కుమార పరిశుద్ధాత్మయను ముగ్గురు

వ్యక్తుల సిద్ధాంతాన్ని శాసనరీతిగా స్థిరపరచినప్పటికినీ, అప్పటి వరకూ ఆచరణలోఉన్న యషువ మెస్సీయ నామమునందలి బాప్తిస్మపు పద్ధతిని విడిచి పెట్టునటువంటి త్రిత్వపు సంఘములవారిని 7వ శతాబ్ధమునందలి పోప్‌లు, రోమా సంఘములనుండి వెలివేసి భహిష్కరించి యుండిరి. 20వ శతాబ్ధము వరకూ యషువ మెస్సీయ నామమున బాప్తిస్మమును ఆచరణలో పెడుతూ, దేవుని యొక్క ఏకత్వమును బోధించిన సంఘము యొక్క కార్యక్రమమును, అభివృద్ధి తేలిక గావించి అస్పష్టముగా వ్రాయుటలో రోమన్ కేథలిక్ రచయితలు కొంతవరకు అబద్ధములను అసూయతో ప్రచారము చేసినట్టు తెలియవచ్చుచున్నది "మధ్యయుగపు ఏకత్వవీరుడు – స్టీవెన్ సిమెన్" అను గ్రంథమును వ్రాసిన గ్రంధకర్త కొనిబెరి ఏమని వ్రాయుచున్నాడంటే. 20వ శతాబ్ధము వరకూ ఏకత్వమును బోధించిన కొన్ని

తెగలు ఉన్నవి, అని వ్రాయుచున్నాడు. (1955లో ఈ గ్రంథమును కొనిబెరి వ్రాసి యున్నాడు. ఈ గ్రంథము కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ – ఇంగ్లాండ్ నందు మనకు లభించును). ఇప్పటి వరకూ త్రిత్వము లేక తండ్రి కుమార, పరిశుద్ధాత్మ యనెడి ముగ్గురు ప్రత్యేక వ్యక్తుల కల్పితము విగ్రహారాధికులైన అన్యజనాంగములో పుట్టి అది కేథలిక్ సంఘంలోనికి ఎలా ప్రవేశించిందో, ఏవిధమైన అధికారముతో అది చెలామణి చేయబడి మూర్ఖముగా నమ్మబడినదో, యింత వరకూ చరిత్ర వెలుగులో చాలా తేటతెల్లముగా చూసియున్నాము. తండ్రి కుమార పరిశుద్ధాత్మ యనెడి బిరుదులే ముగ్గురు వ్యక్తులుగా వివరించడానికి కేథలిక్ కల్పితమును నిస్సందేహముగా నమ్మినవారు వెంబడించిన మరొక మార్గము వేదాంత కళాశాలలను స్థాపించి, దుర్భోధ వ్యాప్తి చేయుట. ఈ వేదాంత కళాశాలల వృత్తాంతమును చరిత్రనుండి కొంత మీ పరిశీలన నిమిత్తమై వ్రాయుచుంటిని.

2వ శతాబ్ధము నాటికి అలెగ్జాంండ్రియా పట్టణమునందలి ముఖ్య సంఘానికి దాదాపు 12 సంఘశాఖలు ఏర్పడినవి. గొప్ప ఉజ్జీవముతో హెచ్చు జనాభా గల ఏకత్వము సంఘమది. విచారకరమైన విషయమేమిటనగా ఆకాశపు సంఘ నాయకులు, భూసంబంధమైన తమ స్వంతలాభముల నిమిత్తము లోకంలోకి పరుగులిడుచూ, దేవుని సంఘములయందుండిన యవ్వనులను వాక్య ప్రకారము నడిపించ నందువలన సంఘ సభ్యులలో వాక్య ప్రకారమైన నీతి, దయా దాక్షిణ్యములు కానరాకుండా పోయినవి. ఈ సంఘ పరిస్థితులు ఈవిధముగా దిగజారిపోయి ఉండగా అదే సమయానికి అలెగ్జాంండ్రియా పట్టణములో వేదాంత విశ్వ విద్యాలయము నెలకొల్పబడింది. ఆ వేదాంత విద్యాలయానికి మొదటి సలహాసంఘ సభ్యులుగా ఎథినాగోరాస్, పంథేయినస్, టైటస్, అనబడు అలెగ్జాంండ్రియా వాడైన క్లెమెంతులు వ్యవహరించిరి. అలెగ్జాంండ్రియావారు భౌతిక శాస్త్రము మీద మక్కువగలవారు. అలెగ్జాంండ్రియావాడైన క్లెమెంత్ ప్రయత్నించి ఒక రకమైన పద్ధతిలో వేదాంత పాఠములను, తయారు చేసాడు. దేవుని వాక్యము ఆత్మావేశముతో మనకు వచ్చినట్టు అలెగ్జాంండ్రియ సంఘము నమ్మినప్పటికినీ, దేవుని వాక్యముతో పాటు సంఘములో సకల విధములయిన వేదాంత విద్యను గూర్చిన అనుభవ జ్ఞానము ప్రతీవారికీ ఉండి తీరాలని గట్టిగా ఒత్తిడిచేసాడు వేదాంత విద్యాలయములో పనిచేసెడి అధ్యాపకులంతా యషువ మెస్సీయ వల్ల కలిగెడి రక్షణ లేని వారునూ, మార్పులేని అన్యులునై యున్నారు. వీరు బోధించేది గ్రీకుల వేదాంతము మరియు అన్యజనుల ఆచారములు. మాత్రమే. వేదాంత విద్యాలయములో తర్ఫీదు మూడు సంవత్సరములు, రేఖాగణితము, భౌతిక శాస్త్రము, నక్షత్ర శాస్త్రము మొదటి సంవత్సరము బోధించేవారు అన్యజనుల వేదాంతమును రెండవ సంవత్సరము బోధించేవారు. నీతిసూత్రములు, విగ్రచారాధికుల కల్పనయైన ముగ్గురువ్యక్తుల కలయికయైన త్రిత్వమువలనైన దేవత్వమును మూడవ సంవత్సరములో బోధించేవారు. ఈవిధమైన పాఠ్యాంశములతో బోధించెడి వేదాంత పాఠశాలలు ఏథెన్సు అంతియొకయ, ఎడెస్సా (టర్కీలోనిది) నిసిబిస్ మొదలగు పట్టణములలో స్థాపించి, అన్యజనుల ఆచారములను, మాత్రమే, వేదాంత విద్యాలయములో తర్ఫీదు మూడు సంవత్సరములు, రేఖాగణితము, భౌతిక శాస్త్రము, నక్షత్ర శాస్త్రము మొదటి సంవత్సరము బోధించేవారు. అన్యజనుల వేదాంతమును రెండవ సంవత్సరము బోధించేవారు. నీతి సూత్రములు, విగ్రచారాధికుల కల్పనయైన ముగ్గురు వ్యక్తుల కలయికయైన త్రిత్వమువలనైన దేవత్వమునను మూడవ సంవత్సరములో బోధించేవారు. ఈ విధమైన పాఠ్యాంశములతో బోధించెడి వేదాంత పాఠశాలలు ఏథెన్సు అంతియొకయ, ఎడెస్సా (టర్కీలోనిది) నిసిబిస్ మొదలగు పట్టణములలో స్థాపించి అన్యజనుల ఆచారములను, ఆత్మీయ జీవితానికి ఉపయోగపడని భౌతిక శాస్త్రమును, మూఢ నమ్మకములను విగ్రహారాధనను, ఎలోహీంపై అవిశ్వాసమును కలిగించెడు నక్షత్ర శాస్త్రమును, ఏకైక ఎలోహీం ఉనికిని వెక్కిరించునట్టి ముగ్గురు ప్రత్యేక వ్యక్తుల కల్పిత జ్ఞానమును నేర్పించుచూ మనుష్యుల మనస్సులను కలిపి చెరుపుటలో ఎక్కువగా ప్రయాస తీసికొనిరి. అలెగ్జాంండ్రియా యందున్న బలమైన ఏకత్వపు సంఘములనుండి యవ్వనస్థులు ఈ వేదాంత విద్యాలయములలో చేరి అన్యజనుల విగ్రహారాధనా సంబంధమైన జ్ఞానమును అభ్యసించిరి. భవిష్యత్తులో వాక్యప్రకారమైన సత్యమును కాపాడుటకు నిలవబడవలసిన యవ్వనులు వేదాంత విద్యయను పేరుతో సాతానుచేతికి అప్పగించబడుటలో అలెగ్జాంండ్రియా సంఘ యవ్వనుల విషయము విచారించవలసినదే. అప్పటి కాలములో వలెనే ఇప్పుడు కూడ యవ్వన పురుషులు స్త్రీలు, బైబిలు కళాశాలల్లో అన్యులచేత కల్పించబడిన విగ్రహారాధనా సంబంధమైన ముగ్గురు వ్యక్తుల సిద్ధాంతాన్ని నేర్చుకొని దేవునికి విరుద్ధమయిన సేవచేయుచూ, దేవత్వమును వెక్కిరించునట్టి సాతాను రాయబారులుగా ఉన్నారు. అయితే వీరంతా పాస్టర్లు అను ముసుగులో మనకు కనబడుచున్నారు. అప్పటి కాలములో వలె గ్రీకుల వేదాంతాన్నీ, సామాన్య శాస్త్రమును నక్షత్ర శాస్త్రమునూ యిప్పుడున్న క్రైస్తవ బైబిలు కళాశాలల్లో బోధించుటలేదు. బైబిలు నందలి గ్రంధాలను విభజనచేయడమూ, వాఖ్యానించడము లాంటి చాలా మార్పులు వచ్చినవి కాబట్టి బైబిలు గ్రంధానికి సంబంధించి అనేక పాఠ్యాంశములను యిప్పుడు బోధించుచున్ననూ 2వ శతాబ్ధమునుండి అన్యజనులచేత నిర్ధారించబడి, బోధించబడిన విగ్రహారాధికుల కల్పనయైన త్రిత్వము లేక ముగ్గురు వ్యక్తుల వేదాంతము మట్టుకు ఆకాలంనుండి యిప్పటి వరకూ సురక్షితముగా మతశాఖలవాళ్ళ ద్వారా, కాపాడబడుచూ బోధించబడుతునే ఉంది.

రోమన్ కేథలిక్‌ల కాలములో మార్టిన్ లూథర్ – కేథలిక్ వారినుండి బయటికి వచ్చాడు యషువ మెస్సీయ నందు విశ్వాసముంచడము ద్వారా నీతిమంతులముగా తీర్చబడతాము తప్ప కేథలిక్ పోప్‌లవద్ద పాపక్షమాపణ దొరకదు. అనెడి వర్తమానముతో బయటికి వచ్చి గొప్ప ప్రచారము చేసాడు. దానికి మించి అర్ధము చేసికొనడానికి లేక గ్రహించడానికి దేవునికి ప్రత్యక్షతలేని కారణమును బట్టి ఆయన చిన్న పిల్లలకు చిలకరించుట, తండ్రి కుమార పరిశుద్ధాత్మ యనెడి ముగ్గురు ఎలోహీంల కలయికయైన కల్పితాన్ని ఆయన దాటవేయటము జరిగినది. అలాగే ఒక దాని వెనుక మరొకటిగా వచ్చిన మత శాఖలన్నియు రోమన్ కేథలిక్‌లు కల్పించిన త్రిత్వ సిద్ధాంతానికి కట్టుబడి పనిచేయుచున్నవి. సర్పము మాట విన్న తరువాత ఎలోహీం ఆజ్ఞలేక ఎలోహీం మాటకు ఆదాము హవ్వలు ఎలాదూరమైపోయారో, అలాగే క్రైస్తవులనే మతశాఖల వాళ్ళు దేవత్వమును వెక్కిరించునట్టి మానవ కల్పిత త్రిత్వము నందు విశ్వాసముంచుట ద్వారా యషువ మెస్సీయ నుండి దూరమైపోయి, ఆయన వాక్కును పోగొట్టుకున్నారు.

ఎలోహీం అనగా ఒకే ఒక్కడు అనెడి గొప్పబోధను పరిశుద్ధాత్మపూర్ణులైన అపోస్తులలనబడిన శిష్యులతో బోధించుట ఆరంభమయి తదుపరి 8వ శతాబ్ధము వరకు ఇదే విధమయిన బోధను కొనసాగించినట్టు చరిత్ర యొక్క ఋజువులను మనము కలిగియున్నాము 3వ వతాబ్ధము నుండి రోమన్ కేథలిక్ వారివలన అనేక ఇబ్బందులు అనుభవించియుండి కూడా యషువమెస్సీయ సర్వాధికారియైన దేవుడు అని చాటుచూ వచ్చిరి. ఎలోహీం అనగా త్రిత్వము అనిగాని ఏలోహీం – త్రియేకుడు అని గాని బైబిలు గ్రంథము చెప్పుటలేదు. బైబిలు గ్రంథమునందు త్రిత్వము, త్రియేకుడు అను మాటకు ఆధారమున్నదని మనము ఎప్పుడు విశ్వసించాలి? త్రిత్వము త్రియేకము అను బోధ ప్రవక్తలచే ప్రవచింపబడి యుండాలి; ప్రవక్తలు ప్రవచించి ఉంటే, ప్రవక్తల మాటలు నెరవేరునట్లు త్రిత్వము త్రియేకము అనుమాటలు యషువ మెస్సీయ పలికి ఉండాలి; యషువ మెస్సీయ పలికి ఉండిన యెడల దానిని సర్వలోకములో వ్యాపింపజేయునట్లు, ఎలోహీం త్రిత్వమై యున్నాడు అనెడి బోధ అపోస్తులలనబడిన శిష్యులు బోధించి ఉండాలి; అపోస్తులులు బోధించియుండిన యెడల అన్యజనాంగమై యుండి క్రైస్తవులమైన మనము ఎలోహీం త్రిత్వము, ఎలోహీం త్రియేకము అనెడి బోధను నమ్మవలసి యున్నది. ప్రవక్తలు ప్రవచించలేదు; యషువమెస్సీయ ప్రస్తావించలేదు, శిష్యులు ప్రచారమూ చేయలేదు. అయితే నీవు నేను ఎలోహీంగా ముగ్గురు వ్యక్తులు అని ఎలా నమ్ముచున్నాము? మన క్రైస్తవ సంఘ నాయకులు రోమన్ కేథలిక్ వారు 3వ శతాబ్ధంలో అధికారపూర్వకంగా ఆమోదించిన ముగ్గురు వ్యక్తుల కల్పనయందు విశ్వాసముంచిన వారు కాబట్టి వారి బోధలో మొదట మనం త్రిత్వమును విని నమ్మితిమి. అటు తరువాత మన సంఘనాయకులు ఏ వచనమును చూపించినా, అందులో త్రిత్వము ఉన్నట్టు భావించుచున్నాము. జరిగే పొరపాటు యిది.

1. మింటను యావెకు సాటియైన వాడెవడు? దైవ పుత్రులలో యావెవంటివాడెవడు? కీర్తన 89:6.

   ఆకాశమందు మహిమా స్వరూపియైన యావెతో సమానమైన వాడులేడట మరియు దైవపుత్రులు లేక ఎలోహీం కుమారులలో యావె వంటివాడునూ లేడట ఎలోహీం కుమారుడుగా భూలోకమునకు వచ్చిన యషువ మెస్సీయ యింకెవరోకాదు యావెయేనని ఈ వాక్యము ఋజువు చేయుచున్నది గ్రహించుకొనుము.

2. కీర్తన 118:20-28 వరకు గల వచనములను మీరు చదువగలిగినచో యషువ మెస్సీయ అనగా యావె గుమ్మము అని కలదు. (20) రక్షణాధారుడై మనకుత్తరమిచ్చినవాడు యావెయని కలదు (21వ) యూదులచేతను, అన్యజనాంగము చేతను. నిషేధించబడినవాడైన యషువమెస్సీయే మూలరాయి లేక పితరుల ఎలోహీం యావెయని, తెలియజేయబడుచున్నది. (22వ) యిది యావె ఏర్పాటు చేసిన దినము దీనియందు మనము ఉత్సహించి సంతోషించెదము అని ఉన్నది కదా? ఏది యావె ఏర్పాటు చేసిన దినము? యావెయే శరీరధారిగా భూలోకమునకు రావడమనేదే యావె ఏర్పాటు చేసిన దినము. ఇది ఎలాగు సాధ్యమని నీవనుకొందువా? అది మన కన్నులకు ఆశ్చర్యమని వాక్యము తెలియజేయుచున్నది. (23,24వ) యషువమెస్సీయ యావె పేరిట వచ్చాడు. యావె పేరిట వచ్చువాడు ఆశీర్వాదమొందును గాక. అని కలదు. (26వ) నేను నా తండ్రినామమున వచ్చియున్నాను. అని యషువమెస్సీయ అందుకే చెప్పియున్నాడు. ఈ వచనమును బట్టి కుమారుడుగా వచ్చిన యషువ మెస్సీయ మహిమా స్వరూపియైన యావెయని తెలియచేయబడుచున్నది.

3. యెషయా 7:14; కాబట్టి ప్రభువు తానే యొక సూచన మీకు చూపును ఆలకించుడి, కన్యక గర్భవతియై కుమారనికని, అతనికి ఇమ్మానుయేలను పేరు పెట్టును. ఈ వచనమును బట్టి సూచన ఇచ్చిన వాడుఎవరు? ప్రభువు సూచనగా వచ్చినవాడు ఎవరు? ఇమ్మానుయేలు. ఇమ్మానుయేలు అనగా అర్ధమేమిటి? ఇమ్మానుయేలనగా ఎలోహీం మనతో ఉన్నాడు అని అర్ధము కాదా? కాబట్టి సూచన యిచ్చినవాడు ప్రభువు, సూచనగా వచ్చినవాడు కూడ ప్రభువే. యిచ్చుట తండ్రి ఒక వ్యక్తియనియు, కుమారుడు మరొక వ్యక్తియనుటకు ఆధారము లేనే లేదని గ్రహించుము.

4. యెషయా 9:6, నందు బలవంతుడైన ఎలోహీంను నిత్యుడగు తండ్రియు కుమారుడుగా భూలోకమునకు వచ్చిన యషువమెస్సీయని వాక్యము ఋజువుచేయుచున్నది.

5. యెషయా 12:2; "ఇదిగో నా రక్షణకు కారణ భూతుడగు ఎలోహీం; నేను భయపడక ఆయనను నమ్ముకొనుచున్నాను. యావె యావెయే నాకు బలము ఆయనే నా కీర్తనాస్పదము ఆయన నాకు రక్షణా ధారమాయెన." రక్షకుడుగా భూలోకమునకు వచ్చినవాడు యావెయేనని ఈ వచనము తెలుపుచున్నది. తండ్రి ఒకరు, కుమారుడుగా వచ్చినవాడు మరియొకరు అని ఈ వాక్యము బోధించుట లేదు.

6. కీర్తన 27:1 యావె నాకు వెలుగును రక్షణయునై యున్నాడు. నేను ఎవరికి భయపడుదును? ఈ వచనము కూడ యెషయా 12:2 వాక్యవమెలెనే – రక్షకుడుగా భూలోకమునకు వచ్చినవాడు యావెయేనని ఋజువు చేయుచున్నది.

7. యెషయా 40వ అధ్యాయము నందు బాప్తిస్మమిచ్చు యోహాను గూర్చియే గాక ఆయన చేసిన బోధ కూడ మందుగానే యెషయా ప్రవక్త చేత ప్రవించపబడినది. దీనియందు బాప్తిస్మమిచ్చు యోహాను యషువమెస్సీయ ఎలోహీమని, యావెయనియు చెప్పిన 7 సందర్భములున్నవి. పరిశుద్ధాత్మపూర్ణుడైన బాప్తిస్మమిచ్చు యోహాను యషువమెస్సీయ కుమారుడను రెండవవ్యక్తిగా బోధించియుంటే ఏ ఒక్కరూ బాప్తిస్మము పొందుటకు వచ్చియుండెడి వారు కారు. అంతేగాక స్తెఫనును రాళ్ళతో కొట్టి చంపినట్టు యూదులు బాప్తిస్మమిచ్చు యోహానును కూడ చంపియుండెడివారే. యషువమెస్సీయను గూర్చి యోహాను యిచ్చిన సాక్ష్యము 7 సందర్భములను చూడుము.

   ఎ) యెషయా 40 :3. అరణ్యములో యావెకు మార్గము సిద్ధపరచుడి.

   బి) యెషయా 40 :5 యావె మహిమ బయలుపరచబడును ఒకడును తప్పకుండ సర్వశరీరులు దాని చూచెదరు. (ఇశ్రాయేలీయులు చూచిన యషువ మెస్సీయ అనగా బయలు పర్చబడిన యావెయని దీని భావము)

   సి) యెషయా 40 :8 గడ్డియెండిపోవును దానిపువ్వువాడిపోవును మన ఎలోహీం వాక్యము నిత్యము నిలుచును.

   డి) యెషయా 40:9 ఇదిగో మీ ఎలోహీమని యూదా పట్టణములకు ప్రకటించుము.

   ఇ) యెషయా 40 :10 ప్రభువగు యావె తానే శక్తి సంపన్నుడై వచ్చును. ఆయనయిచ్చు బహుమానము ఆయన యొద్దనున్నది.

   యఫ్) 40:28 నీకు తెలియ లేదా? నీవు వినలేదా? భూదిగంతములను సృజించిన యావె నిత్యుడగు ఎలోహీం.

   జి) యెషయా 40 :31 యావె కొరకు ఎదురుచూచువారు నూతన బలము పొందుదురు (బాప్తిస్మమిచ్చు యోహాను వెనుక వచ్చువాని కొరకు ఎదురు చూచువారు).

8. యెషయా 43:10 యోహాను 8 : 24; మీరు తెలిసికొని నన్ను నమ్మి, నేనే ఆయననని గ్రహించునట్లు మీరును నేను ఏర్పరచుకొనిన నా సేవకుడును నాకు సాక్షులు. నేను ఆయనను అని యెషయా గ్రంథములో యావె సెలవిచ్చిన మాటయే, యోహాను సువార్త 8:24 నందు – నేను ఆయనని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురని యషువ యూదులతో చెప్పెను. కాబట్టి యషువయే యావెయని విశ్వసించలేనివాడు, వాని పాపములోనే యుండి చనిపోతాడని యషువ చెప్పిన మాటయలందు లక్ష్యముంచుము.

   యెషయా 43:11-12; నేను నేనే యావెను, నేనే తప్ప వేరొక రక్షకుడులేడు. ప్రకటించినవాడను నేనే, రక్షించినవాడను నేనే దాని గ్రహింపజేసినవాడను నేనే; యే అన్యదేవతయు మీలోనుండి యుండలేదు." యావె ఒక్కడే ఎలోహీమును రక్షకుడునై యున్నాడని 11వ. వచనం తెలియజేయుచున్నది.

   ప్రకటించినవాడు – యావె (నేనే)

   రక్షించిన వాడు – యావె (నేనే)

   గ్రహింపజేసినవాడు – యావె (నేనే) అయితే మనము ఈ క్రింది విధముగా అనుకొంటున్నాము. గనుక మన అభిప్రాయము వాక్యప్రకారము తప్పు లేక విరుద్ధము.

   ప్రకటించినవాడు – యావె (మొదటి వ్యక్తి)

   రక్షించినవాడు – యషువమెస్సీయ (రెండవ వ్యక్తి)

   గ్రహింప జేసినవాడు – పరిశుద్ధాత్మ (మూడవ వ్యక్తి)

   కాబట్టి మనము ఊహించు కొంటున్నట్టు ఎలోహీం ముగ్గురు ప్రత్యేక వ్యక్తులుకారని అర్ధమవుతుంది. యషువమెస్సీయ యావెయు ఒకేఒక్కరు.

10. యెషయా 54:13. నీ పిల్లలందరు యావె చేత ఉపదేశము నొందుదురు. నీ పిల్లలకు అధిక విశ్రాంతి కలుగును. ఎలోహీం యాజకుల ద్వారాను, ప్రవక్తలద్వారాను, స్వరముద్వారాను పురాతనకాలములో మాట్లాడియున్నాడే తప్ప ఎలోహీం స్వయముగా దిగివచ్చి ఇశ్రాయేలీయలతో మాట్లాడి యుండలేదు. యషువమెస్సీయగా ఎలోహీం శరీరధారియైవచ్చి యూదులకు బోధించడమే – ఇశ్రాయేలీయుల పిల్లలందరు యావె చేత ఉపదేశింపబడినట్లు, ఈ కారణమును బట్టి కూడ చూసిన యెడల యషువమెస్సీయ – యావెయై యున్నట్టు నిస్సందేహముగా బోధించుచున్నది. యెషయా 54:13 వాక్యమును యోహాను సువార్త 6:45 వాక్యమునందు యషువమెస్సీయ ఉపయోగించియున్నాడు. కాబట్టి ఇద్దరు, ముగ్గురు వ్యక్తుల బోధమరచిపోయి యషువ మెస్సీయ యావెయని అంగీకరించుము.

11. జెకర్యా 11:12-13+ కీర్తన 47:5 ఈ వచనములలో మీ కనుకూలమైన యెడల నా కూలి నాకియ్యుడి అని యూదులను అడిగినవాడు యావె. ముప్పది వెండినాణెములు యావెకే యూదులు తూచి యిచ్చిరి. నాకు ఏర్పరచిన క్రయ ధనము ముప్పది వెండినాణెములేనా? అని ఆశ్చర్యపడినవాడు యావె. గనుక జెకర్యా ప్రవచనమును మనము చదివినప్పుడు – శరీరధారియై భూలోకమునకు యషువ అను నామములోవచ్చి, మ్రానువేయబడి, చనిపోయి, సమాధి చేయబడి, తిరిగి లేచినవాడు ఇంకెవరోకాదు పితరుల ఎలోహీమైన యావెయని ఋజువు చేయబడుచున్నది. ఒకవేళ ఏర్పరచబడిన ముప్పది వెండినాణెముల క్రయధనము కుమారుడనబడిన యషువమెస్సీయ అను రెండవ వ్యక్తికే అయిఉంటే నా కుమారుని కేర్పరచిన క్రయ ధనము ముప్పది వెండినాణెములేనా; అని యావె తండ్రి అని ఉండెడివాడు కాని జెకర్యా ప్రవచనములో నా కేర్పరచిన క్రయ ధనము ముప్పది వెండినాణెములేనా, అని యావె ఎంతో అబ్బురముతో పలికినట్లున్నది గమనించండి. కాబట్టి యావెయే యషువమెస్సీయ ఇప్పుడు కీర్తన 47:5 చదువుదాం. "దేవుడు అర్భాటముతో ఆరోహణమాయెను, బూరధ్వనితో యావె ఆరోహణమాయెను" గమనించండి.

   యషువమెస్సీయ తన శిష్యులను ఒక కొండమీదికి తీసికొనివెళ్ళి కొన్ని విషయములు చెప్పుచూ వారి మధ్యనుండి ఆయన ఆరోహణమైనట్టు అపోస్తుల కార్యములు 1:1-10 వచనములలో ఉంది. యావె ఎప్పుడు ఆరోహణమైనాడు? చెప్పండి. ఆరోహణమైన యషువమెస్సీయ అదృష్యుడైన

యావెయై యున్నాడు. దీనినిబట్టి శరీరధారియై వచ్చినవాడు, మ్రాను వేయబడినవాడు, చనిపోయినవాడు, సమాధి చేయబడినవాడు, తిరిగి లేచినవాడు, ఆరోహణుడై తేజోమయుడయినవాడును, మనుష్యులతో ఉండుటకు పరలోకమునుండి దిగివచ్చిన యావెయై యున్నాడు. యషువమెస్సీయ - యావెయై యున్నాడని గ్రహించుము.

12. జెకర్యా 14:9 యావె సర్వలోకమునకు రాజైయుండును, ఆ దినమున యావె ఒక్కడే అనియు, ఆయనకు పేరు ఒక్కటే అనియు తెలియబడును.

యావె అనగా ఉన్నవాడు అనువాడు అని అర్ధము యషువ అనగా యావెయే మన రక్షణ అని అర్ధము. ఈ విషయమును మీలో కొందరు అంగీకరించలేకపోవచ్చును కీర్తన 27:1 మరియు యెషయా 12:2 వచనములు యషువమెస్సీయ అనగా యావెయే మన రక్షణ అని ఋజువు చేయుచున్నవి. కాబట్టి యావె ఒక్కరు, యషువమెస్సీయ మరొకరు అని యిద్దరు వ్యక్తులను గూర్చి భావించుటకు యిచ్చుట అవకాశము లేదు. యావెయే, యషువమెస్సీయ. ఆయనకు పేరు ఒక్కటే.

13. మత్తయి 1:21-23; "ఆమె యొక కుమారుని కనును; తన ప్రజలను వారి పాపములనుండి ఆయనే రక్షించును. గనుక ఆయనకు యషువ అని పేరు పెట్టుదువనెను. ఇదిగో కన్యక గర్భవతియై కుమారుని కనును ఆయనకు ఇమ్మానుయేలను పేరు పెట్టుదురు అని ప్రభువు తన ప్రవక్త ద్వారా పలికిన మాట నెరవేరునట్లు ఇదంతయు జరిగెను. ఇమ్మానుయేలను పేరునకు భాషాంతరమున ఎలోహీం మనకు తోడని అర్ధము."

కన్యక కనినవాడు ఎవరు? కుమారుడు

ఈ కుమారుని పేరేమేటి? యషువ

కుమారునికి గల మరొక పేరేమిటి? ఇమ్మానుయేలు

కాబట్టి కుమారుడు = యషువ = ఇమ్మానుయేలు; కుమారుడనగా రెండవ వ్యక్తికాడు; కుమారుడు ఇమ్మానుయేలు లేక ఎలోహీమైన యావెయేనని గ్రహించుము.

14. లూకా 2:10-11; "అయితే ఆ దూత - భయపడకుడు; ఇదిగో ప్రజలందరికినీ కలుగబోవు మహా సంతోషకరమైన సువర్తమానము నేను మీకు తెలియజేయుచున్నాము; దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు; ఈయన ప్రభువైన మెస్సీయ" ఈ సువర్తమానము ప్రకటించిన దూత ఎలోహీం సన్నిధిలో ఎల్లప్పుడూ నిలుచుండి ఆయన ఆజ్ఞ కొరకు కనిపెట్టుకొనియుండు ప్రత్యేక వర్తమానికుడైన గబ్రియేలు దూత. గొఱ్ఱెలకాపరులకు వర్తమానము తెలియజేయుటలో గబ్రియేలు దూత పొరబడలేదు. చెప్పవలసిన సత్యమునే ప్రకటించింది. దావీదు పట్టణమందు పుట్టినవాడు. సర్వమానవాళిని రక్షించడానికి వచ్చిన రక్షకుడు అని తెలియజేసింది, ఆ రక్షకుడు త్రిత్వములో రెండవ వ్యక్తియని దూత చెప్పలేదు; ఈయన ప్రభువైన మెస్సీయని చెప్పినది. కాబట్టి యషువమెస్సీయే యావెయైయున్నాడని, ఎలోహీంగా ఒకేఒక్క వ్యక్తియని గ్రహించుము.

15. యోహాను సువార్త 1:1+14; "ఆదియందు వాక్యముండెను, వాక్యము ఎలోహీం యొద్ద ఉండెను. వాక్యము ఎలోహీమై యుండెను. ఆ వాక్యము శరీరధారియై కృపా సత్యసంపూర్ణుడుగా మనమధ్య నివసించెను. (యోహాను 1:14) యోహాను 1:14 ప్రకారము - వాక్యము అనగా యషువ; దేవుడనగా యావె లేక తండ్రి; యిప్పుడు వాక్యము అను మాటకు బదులు యషువ అను మాటను ఉపయోగించి, ఎలోహీం అను స్ధానంలో తండ్రి లేక యావె అను మాటను ఉపయోగించి యోహాను సువార్త 1:1 వాక్యమును మీరు చదివిన యెడల ఆదియందు ఎలోహీమైయున్నాడో, ఎంతమంది ఎలోహీంలై యున్నారో మీరు గ్రహించగలుగుదురు.

ఎ) ఆదియందు యషువ (వాక్యమును) ఉండెను. యషువ (వాక్యము) యావె యొద్ద (ఎలోహీం యొద్ద) ఉండెను. యషువ (వాక్యము) యావెయై (ఎలోహీమై) యుండెను. ఇదే వచనమునకు వాక్యము అనుచోట కుమారుడు అను మాటను పెట్టి చదువుదాము.

బి. ఆదియందు కుమారుడుండెను, (వాక్యము), కుమారుడు (వాక్యము) తండ్రియొద్ద ( ఎలోహీంయొద్ద) ఉండెను. కుమారుడు (వాక్యము) తండ్రియై (ఎలోహీంమై) యుండెను. కాబట్టి యషువ - యావెయని, దేవత్వముతో ఇద్దరు, ముగ్గురు వ్యక్తులులేరని గమనించుకొనుము.

16. యోహాను 8:41-42 "మీరు మీ తండ్రి క్రియలే చేయుచున్నారని (యషువ) వారితో అనెను; అందుకు వారు - మేము వ్యభిచారమువలన పుట్టినవారము కాము, ఎలోహీమొక్కడే మాకు తండ్రి అని చెప్పగా యషువ వారితో ఇట్లనెను; ఎలోహీం మీ తండ్రియైన యెడల ఎలోహీమొక్కనినే ప్రేమించగలిగిన యూదులు, యషువను ఎందుకు ప్రేమించలేకపోయారు? యషువ తండ్రిగా గాక మరొక వ్యక్తిగా అర్ధము చేసికొనుటనుబట్టి ఎలోహీం మీ తండ్రియైతే మీరు నన్ను ప్రేమించాలని యషువ యెందుకు చెప్పియున్నాడు? యషువ మెస్సీయయే తండ్రి గనుక.

17. రోమా 9:5. "పితరులు వీరు వారు శరీరమునుబట్టి మెస్సీయ; వీరిలో పుట్టెను. ఈయన సర్వాధికారియైన ఎలోహీమైయుండి నిరంతరము స్తోత్రార్హుడైయున్నాడు ఆమెన్." యషువమెస్సీయ ఎలోహీమని ఈ వాక్యము తెలియజేయుచున్నది గాని ఆయన ఎలోహీం కుమారుడైన రెండవ వ్యక్తియని తెలుపుటలేదు.

18. 1 కొరింథీ 2:7-8. "ఎలోహీం జ్ఞానము మర్మమైనట్టుగా బోధించుచున్నాము; ఈ జ్ఞానము మరుగై యుండెను. జగదుత్పత్తికి ముందుగానే దీనిని ఎలోహీం మన మహిమ నిమిత్తము నియమించెను. అది లోకాధికారులలో ఎవనికిని తెలియదు; అది వారికి తెలిసియుండిన యెడల మహిమా స్వరూపియగు ప్రభువును సిలువవేయకపోయి యుందురు." సిలువ వేయబడిన యషువ మహిమాస్వరూపియగు ప్రభువు లేక యావెయని పరిశుద్ధాత్మనుబట్టి, పౌలుభక్తుడు ఈ వచనములో తెలియజేయుచున్నాడు గాని యషువ మెస్సీయ - కుమారుడను రెండవ వ్యక్తియని బోధించలేదు.

19. 1 కొరింథీ 10:1-6. "సహోదరులారా! ఈ సంగతి మీకు తెలియకుండుట నాకిష్టములేదు. అదేదనగా, మనపితరులందరు మేఘము క్రిందనుండిరి, వారందరు సముద్రములో నడచిపోయిరి; అందరును మోషేనుబట్టి మేఘములోను సముద్రములోను బాప్తిస్మము పొందిరి; అందరు ఆత్మసంబంధమైన ఒకే ఆహారమును భుజించిరి. అందరు ఆత్మ సంబంధమైన ఒకే పానీయమును పానముచేసిరి. ఏలయనగా తమ్మును వెంబడించిన ఆత్మసంబంధమైన బండలోనిది త్రాగిరి; ఆ బండ మెస్సీయే."

గమనించండి మోషే - ఇశ్రాయేలీయులను ఐగుప్తునుండి కానానుకు నడిపించెడి సందర్భములో పగుల మేఘస్థంభములో నుండియు, రాత్రి అగ్ని స్థంభములోనుండియు వారిని వెంటాడి కాపాడినవాడు ప్రభువైన యావె ఇశ్రాయేలీయులను వెంబడించిన ఆత్మసంబంధమైన బండ అనగా యషువమెస్సీయనని 5వ వచనములో పౌలు భక్తుడు తెలియజేయుచున్నాడు. పాతనిబంధన కాలములో ఇశ్రాయేలీయులను వెంబడించిన యావె అనగా నూతన నిబంధన కాలపు మెస్సీయేనని పౌలు భక్తుడు స్పష్టము చేసియున్నాడు. కాబట్టి యషువయే - యావెయని తెలిసికొని అంగీకరించుము.

20. ప్రకటన గ్రంథమునందలి ఈ క్రింది వాక్యములను మనము చదివిన యెడల ఆ వాక్యములన్నియూ అల్ఫా - ఓమెగయు నేనే, ఆది అంతరము నేనే, మొదటివాడను కడపటివాడను నేనేయని తెలియజేయుచున్నవి. ప్రకటన 1:4,8,18; 2:8; 4:8; 11:17; 21:6; 22:13; ఈ వచనములన్నిటిలోనూ మొదటివాడు, కడపటివాడును, నేనేయని తనను గూర్చి తానుగా యషువమెస్సీయ నిర్ధారణగా చెప్పుకొని యుండిరి. ప్రకటన 1:18 వాక్యమును చూడుము "నేను మొదటివాడను కడపటివాడను జీవించువాడను; మృతుడనైతినిగాని, ఇదిగో యుగయుగములు సజీవుడనై యున్నాను." ఈ వాక్యమును పరిశీలించండి. మృతుడైనవాడు ఎవరు? యషువమెస్సీయ తిరిగిలేచి సజీవుడుగా ఆరోహణమైన వాడు ఎవరు? యషువమెస్సీయ పాతాళము మరణము ఎవరి స్వాధీనములో ఉన్నవి? యషువమెస్సీయ స్వాధీనములో వున్నవి. నేనే మొదటివాడను. లేక యావెను కడపటివాడను లేక యషువ మెస్సీయను అని యషువ మెస్సీయ స్వయముగా సాక్ష్యమిచ్చుచుండగా వాక్యమును గ్రహించలేక యషువమెస్సీయు పైన మరొక తండ్రి ఉన్నాడని భ్రమించుట వాక్య విరుద్ధము. యషువమెస్సీయ బిడ్డలమని చెప్పుకొంటూ ప్రటకన 1:18 నందలి యషువమెస్సీయ సాక్ష్యమును నమ్మలేకపోవడం మీరు మెస్సీయ బిడ్డలు కారనియు, మెస్సీయ బిడ్డలవలె నటించువారనియు, తెలియజేయబడుతుంది.

## తండ్రిని గూర్చి నీవు ఎరిగినది ఎంత?

క్రైస్తవులమైన మనలో అనాది కాలమునుండి తండ్రి కుమార పరిశుద్ధాత్మయను మాటలు జీర్ణించుకుపోయినవి. రెండవదిగా మనము సువార్తలు చదువుచున్నప్పుడు తండ్రి అనెడి మాటలు చదువుచుండిన కారణమునుబట్టి తండ్రి యనెడి ఒక వ్యక్తి ఉన్నాడని మనము నిర్ధారించుకొనుచున్నాము. మూడవదిగా తండ్రియనెడి పదము యషువమెస్సీయ ఉపయోగించుటను బట్టి నిజముగా తండ్రి అను ఒక వ్యక్తి ఉన్నాడని నమ్ముకొని ఒక గ్రుడ్డినమ్మకమును కలిగియున్నాము. అయితే యిప్పుడు తండ్రి అను పదమునుగూర్చి బైబిలు గ్రంథము బోధించెడి విధానమును పరిశీలించి ఒక నిర్ణయానికి రావడము సరియైన విధానమైయున్నది.

తండ్రి అను వ్యక్తినిగూర్చి మనము నమ్మకము కలిగి యున్నాము, కాబట్టి యషువమెస్సీయ అను ఒకని మీదనే మనము విశ్వాసముంచక, తండ్రియనెడి మరియొక వ్యక్తి మీద కూడ విశ్వాసముంచి యున్నాము. యోహాను సువార్త 1:18; 5:37-38; 6:46; 1తిమోతి, 6:16; 1యోహాను 4:13 లందు గల యీ 5వ వచనములు తండ్రి అను ఒక వ్యక్తిని ఎవడును, ఎప్పుడును, చూడలేదు. చూడనేరదు అని తెలియజేయుచున్నవి. మానవుడవైయుండి నీవు ఎప్పుడును ఎఱుగని, చూడని, తండ్రి అను ఒక ఒక వ్యక్తి ఉన్నాడని ఎందుకు నమ్ముచున్నావు? ఎలానమ్మినావు? వాక్యాధారమేమిటి?

ఎవడును ఎప్పుడైనను దేవుని చూడలేదు; తండ్రి రొమ్ముననున్న అద్వితీయ కుమారుడే ఆయనను బయలుపరచెను. అని యోహాను సువార్త 1:18 నందు కలదు ఈ వచనమునే మనము ఆధారముగా తీసికొనినచో యషువ మెస్సీయ తండ్రి అను ఒక వ్యక్తిని బయలుపరచినట్టు వ్రాయబడిఉంది. అయితే యషువమెస్సీయ తాను శారీరధారియైయున్న దినములలో ఎవరికైననూ తండ్రిఅనబడు ఒక వ్యక్తిని బయలుపరచినాడా? చూపించినాడా? తండ్రి అను మరొక వ్యక్తిని ఎవరికినీ ఎప్పుడునూ చూపించినట్టు ఒక్క ఉదాహరణకూడ నమము ఎంత వెదికినా బైబిలు గ్రంథము నందు చూడలేము. కాబట్టి యషువ మెస్సీయ బయలుపరచనిదే తండ్రి అనెడి మరొక వ్యక్తిని మీరు ఎక్కడ చూసి ఆయనయందు నమ్మకముంచుచున్నారు?

ఫిలిప్పు ప్రభువును చూచి -ప్రభువా! తండ్రిని మాకు కనపరచుము మాకంతే చాలునని ఆయనతో చెప్పగా - యషువ ఫిలిప్పూ! నేనింత కాలము మీ యొద్ద ఉండినను నీవు నన్ను ఎరుగవా? నన్ను చూచిన వాడు తండ్రిని చూచియున్నాడు. గనుక తండ్రిని మాకు కనుపరచుమని యేలచెప్పుచున్నావు? అని యషువ ప్రభువు ఫిలిప్పుకు సమాధానమిచ్చినట్టు యోహాను 14:8-9 వచనములో చదువగలము, యషువను చూడటము ఎరిగియుండడమే. తండ్రిని చూడటము ఎరిగి యుండటమైన యెడల యషువకు వేరొకతండ్రి ఉన్నాడని ఎందుకు భావించుచున్నారో, ఆలోచించుకొనండి.

యషువమెస్సీయ తండ్రికి ప్రార్ధించినాడనియు, తండ్రీ తండ్రీ అని ఎన్నో మారులు పలికినాడనియు, మరొకొన్ని సందర్భములు మీరు చూపించి వాటిని బట్టి యషువమెస్సీయకు మరియొక తండ్రి ఉన్నాడని తండ్రి అనుపదమును 109 మార్లు యషువమెస్సీయ ఉపయోగించి యున్నాడు. కాబట్టి తండ్రి అను వ్యక్తి నిశ్చయముగా ఉన్నాడని భావిందామా? యోహాను 16:25 నందు ఈ సంగతులు గూఢార్ధముగా మీదో చెప్పితిని; అయితే నేనిక యెన్నడును గూఢార్ధముగా మీతో మాటలాడక తండ్రిని గూర్చి మీకు స్పష్టముగా తెలియజెప్పు గడియ వచ్చుచున్నది; అని యషువ చెప్పియున్నాడు. కాబట్టి తండ్రి అను మాట గూఢార్ధముగా, మర్మముగా, అలంకార రూపముగా, ఉపమానముగా చెప్పాను అని యషువమెస్సీయ చెప్పియుండగా ఇదిగో యిక్కడ తండ్రకి ప్రార్ధించినాడు. అక్కడ తండ్రి నాకంటె గొప్పవాడన్నాడని చెప్పాడు అని ఆ మాటలు పట్టుకొని యిక వ్రేలాడవలసినపని ఏమున్నదో చెప్పండి? తండ్రి అను మాట మర్మముగా, ఉపమానముగా చెప్పాను అనెడి యషువ మాటను కొట్టివేసి తండ్రి అను మరొక వ్యక్తి ఉన్నాడని చెప్పడానికి, నమ్మడానికీ క్రైస్తవులకు వాక్యాధారమేది; తండ్రిలేడు అనెడి యేసు మాటను నమ్మలేనివాడు ఎలాంటి క్రైస్తవుడో ఆలోచించండి.

ఆదికాండము 14వ అధ్యాయమును మీరు చదివిన యెడల సొదొమ. గొమొఱ్ఱ, అద్మా, సెబోయీ, సోయరు అను 5 ప్రాంతములను పరిపాలించు ఐదుగురు రాజులు వారి శత్రువులైన ముగ్గురు రాజులచేతిలో ఓడిపోయి వారికి బానిసలైపోయారు. సొదొమలో నివసించుచుండిన లోతు కుటుంబముకూడ చెరగొనిపోవబడినవారిలో ఉన్నందున లోతును విడిపించు నిమిత్తము తనతో 318 మందిని తీసికొని అబ్రాహాము వెళ్ళి ఆ ముగ్గురు రాజులను ఓడించి ఐదుగురు రాజులను వారికి కలిగిన సమస్తమును తిరిగి తీసికొని వచ్చుచుండెను. ఇప్పుడు హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 7వ అధ్యాయము మొదటి మూడు వచనములను చదువుదాము. రాజులను సంహారము చేసి అబ్రాహాము తిరిగి వచ్చుచుండగా మెల్కిసెదెకు అను నామములో ఒకరు అబ్రాహామును త్రోవలో కలిసికొని అతనిని ఆశీర్వదించి, రొట్టెను ద్రాక్షారసమును యిచ్చెను. అబ్రాహాము, మెల్కిసెదకునకు తనకు కలిగిన అన్నింటిలో నుండి పదియవ భాగమును (దశమభాగమును) సమర్పించాడు.

## ఈ మెల్కీసెదెకు ఎవరట?

నీతిరాజట, సమాధానమునకు రాజట.

మెల్సీసెదెకు - తండ్రి లేనివాడట.

మెల్కీసెదెకు - తల్లి లేనివాడట.

మెల్కీసెదెకు - వంశావళి లేనివాడట

మెల్కీసెదెకు జీవితకాలమునకు ఆదియు, జీవమునకు అంతము లేనివాడట,

మెల్కీసెదెకు - ఎలోహీం కుమారుని పోలియున్నాడట.

ఈ మెల్కీసెదెకు యాజక కుటుంబమునకు చెందిన మానవుడని ఏ క్రైస్తవుడైనా వర్ణించినచో లేఖనములను దారిమళ్ళించు దుష్టుడని వాడిని బాహాటముగా గద్దించితీరాలి మానవుడు నీతికిని, సమాధానమునకును రాజుకాగలడా? మానవుడు తల్లిగాని, తండ్రిగాని లేనివాడు కాగలడా; వంశావళిలేని మానవుడుంటాడా? మానవుని జీవితానికి ఆదిఅంతములుండవా? మానవుని ఎవడైనా పదియవవంతు రాబడిని చెల్లిస్తాడా? ఈ ప్రశ్నలన్నియూ ఆలోచించుండిన నీవు - మెల్కీసెదెకు మానవుడైన యాజకకుటుంబమునకు చెందినవాడు మాత్రము కానేకాడని నిర్ధారించుకొనుము.

ఇప్పుడీ క్రింది విషయమును ఆలోచించండి.

జీవితమునకు ఆదియైనను, జీవనమునకు అంతమైనను లేనివాడు ఎవరు? ఉన్నవాడను అనువాడను అని మోషేతో పలికినవాడు కాడా? కాబట్టి ఉన్నవాడు అనువాడునైన యావెయే, మెల్కీసెదెకు అను పేరుతో అబ్రాహామునకు ప్రత్యక్షమైనాడు. ఉన్నవాడు అనువాడు అయిన ఆ యావె నూతన నిబంధన కాలములో యషువ అను నామములో ప్రత్యక్షమై, ఎలోహీం కుమారుని పోలినవాడైనాడు; ఇదీ అపోస్థులుడైన పౌలు. పరిశుద్ధాత్మద్వారా మనకు వివరించేది. ఎలోహీం కుమారుని పోలివచ్చిన యషువ మెస్సీయ తండ్రి లేనివాడని, ఆది అంతములు లేనివాడని వాక్యము ఋజువు చేయుచుండగా యషువమెస్సీయకు పైన మరొక తండ్రి ఉన్నాడని నమ్ముటలో, మీరు అబద్ధమును నమ్మి, సత్యమును బాహాటముగా వ్యతిరేకించు వారనే సాక్ష్యమును మీలో కలిగినవారే సుమా.

మరొక ఉదాహరణను చూద్దాం. యోహాను సువార్త 1:14 నందు - "తండ్రి వలన కలిగిన అద్వితీయకుమారుని మహిమవలె మనము ఆయన మహిమను కనుగొంటిమి" అని కలదు. యషువ మెస్సీయను కనుగొనుట తండ్రి వలన కలిగిన యేకైక కుమారుని కనుగొన్నట్టున్నదట. లేక అద్వితీయ కుమారుని మహిమను చూచినప్పుడు - మహిమాస్వరూపియైన ఎలోహీం చూచినట్టేనని ఈ వాక్యము యొక్క భావము; లేక కుమారుడుగా కనబడుచున్న యషువయే మహిమా స్వరూపియైన యావెయని భావము. ఈ అభిప్రాయము తప్పు అని మీరు భావించలేరు కారణమేమిటనగా శరీరధారియై వచ్చినవాడు అద్వితీయకుమారుడు అని వాక్యము తెలియచేయుచున్నది. అద్వితీయుడనగా - రెండవవాడు కాని వాడే లేక మొదటివాడే కుమారుడుగా వచ్చియున్నాడని ఋజువు చేయబడుతుంది. కాబట్టి యషువ తండ్రి, యషువ కుమారుడు. యషువకు మరొక తండ్రి ఉండడం జరగనిపనియై యున్నది.

And the word was made flesh, and dwelt among us; and we beheld His glory as of the only begotten of the father full of grace and truth. అద్వితీయుడు అనెడి మాటను ఇంగ్లీషు భాషయందు Begotten అని అందురు Begotten లేక got అను మాటయొక్క భావమును మనము వివరించుకొనినచో యషువే - తండ్రి యనెడి భావము మనకు తెలియనగును.

Begotten అనగా One who begets లేక the agent that occasions or originates anything కలిగియున్న దేనికైనను మూలము అని భావము get అనగా to come to have, Begotten is He who occasions to come to have the exact Qualification of the begetter.

(సశేషం)

**త్రిత్వమును గూర్చిన దురనుమానములు :**1. ఆది 1:1, 1:26-27, 11:6-7, 18:1-3, యెషయా 6:8, మత్తయి 3:16-17, 28:19, 2 కొరింథీ 13:14, 1 థెస్సలోనిక 5:23, 1 యోహాను 5:6,7 మీ కొరకై ప్రశ్నలు జవాబుల రూపంలో మన వెబ్‌సైట్‌లో పెట్టుట జరిగింది. కావున మీరు వాటిని అక్కడ చదువవచ్చు.

మన వెబ్‌సైట్ : **www.aotle-india.org**

Edited, Printed, Published and Owned by Isaac E. Kusuma for AOTLE -India Ministries, Malikipuram - 533 253, E.G.Dt., A.P., India